# కరీంనగర్ జిల్లాలో ఆర్బీఎల్ బ్రాంచీలో భారీ కుంభకోణం

- మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల ఆర్థిక లావాదేవీలు
- ఈ ఖాతాల ద్వారా అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు గుర్తించిన అధికారులు
- చైనా వారితో కలిసి సాయిరామ్ అనే వ్యక్తి కమీషన్ మీద మోసాలకు పాల్పడినట్లు గుర్తించిన అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలోని కిసాన్‌నగర్ ఆర్బీఎల్ బ్రాంచీలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. ఏడు మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ ఖాతాల ద్వారా అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. చైనా దేశానికి చెందిన మోసగాళ్లతో కలిసి సాయిరామ్ అనే వ్యక్తి కమీషన్ మీద ఈ మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.ప్రతి లావాదేవీపై క్రిప్టో కరెన్సీ ద్వారా సాయిరామ్ రెండు శాతం కమీషన్ తీసుకున్నట్లు తేలింది. ఈ బ్యాంకులో ఈ తరహా మోసానికి సంబంధించి ఎనిమిది కేసుల్లో 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు కరీంనగర్ సీపీ వెల్లడించారు. నిందితులకు కమీషన్ ద్వారా రూ.2 కోట్ల వరకు వచ్చాయని తెలిపారు. ఈ కేసులో నిందితులుగా ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమా విద్యార్థులు ఉండటం గమనార్హం.

## పెన్ పవర్ తెలంగాణ రౌండప్





# ఘనంగా సీతారాముల కళ్యాణం

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. సంప్రదాయం ప్రకారం స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఇదే సందర్భంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.శ్రీరామనవమి నాడు పాలకులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం గోల్కొండ నవాబుల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి స్వామివారికి వస్త్రాలు అందజేశారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టాక, భద్రాద్రి రాముడిపై తన భక్తిని చాటుకుంటూ ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

భద్రాచలం ఆలయాన్ని మూడు దశల్లో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మొత్తం రూ.586 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా తొలి దశలో రూ.351 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీరామనవమి రోజునే భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు.

- భద్రాచలంలో సీతారాముల కళ్యాణానికి సతీసమేతంగా హాజరైన సీఎం రేవంత్
- స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ
- ఆలయ విస్తరణలో భాగంగా రూ.351 కోట్ల పనులకు శంకుస్థాపన
- మూడు దశల్లో రూ.586 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు

## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం.. సిటీ మొత్తం ఒకటే ఉరుములు, మెరుపులు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో మళ్లీ వర్షం మొదలైంది. శుక్రవారం (మార్చి 27) ఉదయం నుంచి నగరంలో ఎండ దంచికొట్టగా.. రాత్రి వేళ సిటీ మొత్తం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వాన పడుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకపూల్, ఎర్రమంజిల్, సోమాజిగూడ, నాంపల్లి, దిల్సుఖ్ నగర్, ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, మల్కాజ్గిరి, నేరేడ్మెట్, కుషాయిగూడ, ఆల్వాల్, దమ్మాయిగూడ, నేరేడు మెట్, మేడ్చల్, ఎల్బీనగర్, హయత్ నగర్, నాగోల్, వనస్థలిపురం, అబ్దుల్లా పూర్ మెట్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కొంపల్లి, సుచిత్ర, సూరారం, చింతల్,

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



స్వామివారి కళ్యాణం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరిస్తూ..

# నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో.. ఘనంగా సీతారాముల కళ్యాణం..!

**అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవం..**

**జర్నలిస్ట్ కాలనీలోని ఈ వాడుకలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పూజలు..**

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 27:** నిజాంపేట జర్నలిస్ట్ కాలనీ పరిధిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. సంప్రదాయ పద్ధతుల్లో, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించిన ఈ వేడుకలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం అంతా పూలతో అలంకరించి, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ సీతారాముల దివ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమం నిర్వాహకుడు సూర్య నారాయణ కీలక పాత్ర పోషించారు. వేడుకలను సక్రమంగా నిర్వహించడంలో ఆయనతో పాటు సేవకులు విస్తృతంగా కృషి చేశారు. అలాగే సీనియర్ జర్నలిస్టులు కొలేపాక వెంకట్, నాగేంద్ర చారి, జగదీష్ గుప్త కుటుంబ సమేతంగా ప్రత్యేక అతిథులుగా హాజరై కార్యక్రమానికి మరింత శోభను తెచ్చారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాముల దివ్యమైన కళ్యాణాన్ని తిలకించి, స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. వేడుకల అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించగా, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు



స్వామివారికి తలంబ్రాలు సమర్పిస్తున్న కొలెపాక వెంకట కవిత దంపతులు..

## హైదరాబాదులో శ్రీరామనవమి శోభాయాత్రను ప్రారంభించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

- భారతీయ సంస్కృతిలో రామాయణానికి విశిష్టత ఉందన్న గవర్నర్
- ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడు శ్రీరాముడు అన్న గవర్నర్
- ఐకమత్యం, భక్తిభావనకు శోభాయాత్ర నిదర్శనమని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఈ శోభాయాత్ర కొనసాగుతుంది. శోభాయాత్రను ప్రారంభించిన అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణానికి చాలా విశిష్ఠత ఉందని అన్నారు. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడుగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తిభావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని గవర్నర్ అన్నారు.

## శోభాయాత్రకు 3వేల మందితో బందోబస్తు: సీపీ సజ్జనార్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడారు. "నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో

-4లో






సూరారం కాలనీలోని పలు బస్తీలలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న వారాల వినోద్ కుమార్..

# మహేశ్వరంలో వైభవంగా.. శ్రీ సీతారామ కళ్యాణం..

## ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ కావలి గణేష్ దంపతులు పాల్గొన్నారు..

**దుండిగల్, పెన్ పవర్, మార్చి 27:** దుండిగల్ డివిజన్ పరిధిలోని మహేశ్వరం గ్రామంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.. గ్రామంలోని ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ మహోత్సవానికి దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ సతీ సమేతంగా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రాములోరి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హర్షధ్వానాల మధ్య జరిగిన శ్రీ సీతారామ కళ్యాణం గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సామూహికంగా పాల్గొని సంస్కృతి సంప్రదాయాలను, భక్తి భావాన్ని చాటిచెప్పారు.. కార్యక్రమంలో నీరుడు గణేష్, నాగారం జితయ్య, నిరుడు నరసింగరావు, నిరుడు సంజీవ, ఓట్ల శ్రీహరి, నాగారం కృష్ణ, నాగారం నరేష్, నీరుడు రాజు, కొవ్వల దుర్గారావు, మల్లెల దశరథ్, పోగుల ప్రభాకర్, నీరుడు సాయి, ఐలాపురం శంకర్, మల్లెల నరసింహారావు, మల్లెల బాలకృష్ణ, పోగుల రమేష్, మల్లెల సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మాజీ సర్పంచ్ దంపతులు..

# గోతిక్ పెంటగాన్ క్లౌడ్స్ సొసైటీలో.. మొదటి శ్రీరామనవమి వేడుకలు..

## సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న క్లౌడ్స్ సొసైటీ సభ్యులు..



**దుండిగల్, పెన్ పవర్, మార్చి 27:** గోతిక్ పెంటగాన్ క్లౌడ్స్ సొసైటీలో మొట్ట మొదటిసారి శ్రీరామ నవమి వేడుకలు అత్యంత ఘనంగా, నిర్వహించారు.. గోతిక్ పెంటగాన్ క్లౌడ్స్ సొసైటీలో తొలి సారిగా నిర్వహించిన ఈ శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి. ఈ వేడుకలు సొసైటీ నివాసులు పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.. శ్రీరాముని కల్యాణోత్సవం సొసైటీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, పురుషులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిభావంతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో చైర్మన్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆదిత్య, సెక్రటరీ రవి తేజ, ట్రెజరర్ స్నేహల్, జాయింట్ సెక్రటరీ సుమంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించారు.. సమాజంలో ఐక్యతను పెంపొందించే ఈ తరహా కార్యక్రమాలు మరింతగా కొనసాగించాలని నివాసులు అభిప్రాయపడ్డారు. తొలి ప్రయత్నంగా నిర్వహించిన ఈ వేడుకలు అద్భుత విజయాన్ని సాధించడంతో నిర్వాహకులకు అభినందనలు వెల్లువెత్తాయి.

## హైదరాబాద్‌లో మళ్లీ వర్షం.. సిటీ మొత్తం ఒకటే ఉరుములు, మెరుపులు

-3 పేజి తరువాయి

షాపూర్ నగర్, బహదూర్పల్లి, దుండిగల్, మల్లంపేట, గండి మైసమ్మ, గాజులరామారం, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఒక్కసారిగా వర్షం కురువడంతో శ్రీరామ నవమి పురస్కరించుకుని సిటీలోని పలుప్రాంతాల్లో నిర్వహించిన శోభాయాత్రలకు ఆటంకం ఏర్పడింది. వర్షపు నీరు భారీగా రోడ్లపైకి చేరడంతో నగరంలోని పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి భానుడి ప్రతాపానికి అల్లాడిపోయిన నగరవాసులు రాత్రి వేళ కురిసిన వర్షంతో సేద తీరుతున్నారు.

## శోభాయాత్రకు 3వేల మందితో బందోబస్తు

-3 పేజి తరువాయి

శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలి" అని సజ్జనార్ కోరారు.

## వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

**తాండూరు, మార్చి 27 పెన్ పవర్:** కోటబాస్పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని శుక్రవారం మాజీ హోంమంత్రి సబితారెడ్డి సోదరుడు, సిటీకేబుల్ ఎండీ నరసింహారెడ్డి, సుస్మితారెడ్డి అధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి పాదాల చెంత అక్షింతలు వేసి, కల్యాణ క్రతువును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు మాంగళ్యధారణ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## రోహిత్‌రెడ్డి డ్రగ్స్ కేసు.. ముగిసిన కస్టడీ

**పరిగి, మార్చి 27 పెన్ పవర్:** మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ, కాల్పుల కేసులో ప్రధాన నిందితుల కస్టడీ ముగిసింది. రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, దిల్లీ వ్యాపారి నమిత్‌శర్మను మంగళవారం కస్టడీకి తీసుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం.. గడువు ముగియడంతో చంచల్‌గూడ జైలుకు తరలించింది. కస్టడీలో నిందితులు ఇచ్చిన సమాధానాలు, రోజువారీ విచారణలో మిగిలిన 8 మంది నిందితుల వాంగ్మూలాలతో పోలీసులు బలమైన ఆధారాలు సేకరించారు. రోహిత్ నిర్వహించే పార్టీలకు తిరువీధుల అర్జున్‌రెడ్డి, ప్రియాంకరెడ్డి ఎక్కువగా హాజరవుతున్నట్లు గుర్తించారు. కేసులో జూబ్లీహిల్స్‌కు చెందిన వైద్యుడు బాలాజీని అదుపులోకి తీసుకున్న సిట్ అధికారులు.. నోటీసులిచ్చి వదిలేశారు. బాలాజీ కేవలం వినియోగదారుడు మాత్రమేనని నిర్ధారించుకున్నారు. మరింత సమాచారం రాబట్టేందుకు రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు ఉప్పర్‌పల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి

**నాగర్‌కర్నూల్, మార్చి 27 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచికుళ్ల రాజేష్ రెడ్డి, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ, నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని, తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సూర్యాపేట లో శ్రీ సీతా రాముల కల్యాణం

**సూర్యాపేట, మార్చి 27 పెన్ పవర్:** శ్రీరామనవమి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని రామలింగేశ్వర థియేటర్ వద్ద జరిగిన శ్రీ సీతారాముల వసంత కల్యాణ మహోత్సవంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, శ్రీరామనవమి ధర్మం, న్యాయం, నీతి విలువలను తెలియజేసే పండుగ అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు అంజత్ కూడా పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సత్తా

**కోదాడ, మార్చి 27 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా, కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో అద్భుత విజయం సాధించారు. 4వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలకు హాజరైన 12 మంది విద్యార్థుల్లో 11 మంది సీట్లు సాధించి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గుజ్జుల నరసింహారెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో ఎండిపోయిన కలెక్టర్ నాటిన మొక్కలు

**తుంగతుర్తి, మార్చి 27 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా కలెక్టర్ తేజస్నందలాల్ పవర్ ఇటీవల నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. రోగులు, స్థానికులు అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాటిన మొక్కలకు సరైన రక్షణ లేదని, అవి దిక్కులేకుండా పోతున్నాయని ఆరోపిస్తున్నారు.

## సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూకల సుదర్శన్ రెడ్డి

**హుజూర్‌నగర్, మార్చి 27 పెన్ పవర్:** సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన సీనియర్ న్యాయవాది, జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ నూకల సుదర్శన్ రెడ్డికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదుల నమ్మకాన్ని గెలుచుకుని విజయం సాధించడం అభినందనీయమని, బార్ అసోసియేషన్ అభివృద్ధికి ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని సర్వోత్తమ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంక్షేమం, న్యాయ సేవల మెరుగుదల కోసం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

## రామారెడ్డిలో ఘనంగా సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం

**ఎల్లారెడ్డి, మార్చి 27 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. క్రీస్తుపూర్వం 1560 సంవత్సరంలో వెలిసిన ఈ ప్రాచీనమైన స్వయంభు పుణ్యక్షేత్రంలో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి, ఇసనపల్లి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామారెడ్డిలో సీతారామచంద్ర స్వామి కళ్యాణం

**కామారెడ్డి, మార్చి 27 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి, రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుంది. క్రీస్తుపూర్వం 1560 సంవత్సరంలో వెలిసిన ఈ ప్రాచీన పుణ్యక్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో రామారెడ్డి, ఇసనపల్లి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

## రాంపూర్ లో ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

**జుక్కల్, మార్చి 27 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం రాంపూర్(కలన్) గ్రామంలో శుక్రవారం శ్రీ రామ నవమి సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రామ మందిరం వద్ద శ్రీ సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శ్రీరామ నామస్మరణతో పల్లకి సేవ నిర్వహించి, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మోషంపూర్ లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**బాన్సువాడ, మార్చి 27 పెన్ పవర్:** శుక్రవారం రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, 'జైశ్రీరామ్' అంటూ భజన కీర్తనలు ఆలపించారు. రథంపై సీతారాముల విగ్రహాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా, భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల చెరువు ఉమకంతరావు, గర్దాస్ ఉమాపతి, పొన్నాల శ్రీనివాస్, కుమ్మరి దత్తాద్రి పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**శేరిలింగంపల్లి, మార్చి 27 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లిలోని మియాపూర్ సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో మదీనగూడలోని కల్లం అంజిరెడ్డి విద్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ భద్రత, రోడ్డు నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ రోజు జరిగిన ఈ కార్యక్రమంలో, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లేష్, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐటి అదుపులో గోల్డ్ మ్యాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** శేరిలింగంపల్లికి చెందిన బంగారు బాబు, హోప్ ఫౌండేషన్, తెలంగాణ హాకీ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ను ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న హాకీ ఇండియా అవార్డుల ప్రధానోత్సవానికి బయలుదేరిన కొండ విజయ్ కుమార్ ను హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో గురువారం రాత్రి స్థానిక ఐటీ అధికారులు అడ్డుకొని పాన్ కార్డు స్వాధీనంచేసుకున్నారు. తదనంతరం కొండ విజయ్ కుమార్ న్యూఢిల్లీ ఎయిర్ పోర్టులో దిగగానే అక్కడి ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు నలుగురు వారిని అదుపులోకి తీసుకొని ఎయిర్ పోర్టు లోనే విచారణ ప్రారంభించారు. తనఒంటిపైన ఉన్న బంగారం మొత్తాన్ని సీజ్ చేయడంతో పాటు వారి పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. 12 గంటల పాటు విచారించిన అధికారులు అవార్డుల ప్రధానోత్సవానికివెళ్లడానికి అనుమతిని ఇచ్చారు. అనంతరం మళ్లీ వారిని విచారణకు హాజరు కావాల్సిందిగా సూచించినట్లు సమాచారం.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## యువతిపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

**భూపాలపల్లి, మార్చి 27 పెన్ పవర్:** డిగ్రీ చదువుతున్న ఓ యువతిని పరిచయం చేసుకొని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి, ఆ తర్వాత పెళ్లి చేసుకోనని చెప్పిన నేలకంటి జోసెఫ్ తంబికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.ప్రేమలతారెడ్డి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజిపేట గ్రామానికి చెందిన జోసెఫ్ తంబి (26) ఎంబీఎం చదువుతుండగా తన గ్రామానికి చెందిన ఓ యువతి తన సోదరి ఇంటికి వచ్చి వెళ్తున్న క్రమంలో పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికంగా కలిశారు. ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలని ఆ యువతి కోరగా మాట దాట వేశాడు. దీంతో యువతి తల్లిదండ్రులు, కొంత మంది పెద్దలు కలిసి 2022 జనవరి 2న అతని తల్లిదండ్రులు అక్కలు, బావలకు చెప్పారు.

## ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

**సంగారెడ్డి, మార్చి 27 పెన్ పవర్:** సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు వేదమంత్రాల నడుమ ఈ ఉత్సవాన్ని నిర్వహించగా, భక్తులు 'శ్రీరామ జయరామ జయ జయ రామ' అంటూ నామస్మరణతో స్వామివారిని కొనియాడారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సంజీవరెడ్డి



**ఆందోల్, మార్చి 27 పెన్ పవర్:** సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సంగారెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ధర్పల్లి అశోక్, కోశాధికారిగా మంజుల విజయం సాధించారు. నూతన అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

## రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

**నారాయణఖేడ్ మార్చి 27 పెన్ పవర్:** చిన్నశంకరంపేట మండలం ధర్పల్లి నుంచి ఉప్పులింగాపూర్ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో కంకర తేలి గుంతలమయంగా మారింది. ఈ కారణంగా రాత్రిపూట ఒక ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. నిత్యం ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీరామ నవమి వేడుకల్లో చిన్నారుల ఉత్సాహం

**జహీరాబాద్, మార్చి 27 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా, నారాయణ్ ఖేడ్ నియోజకవర్గంలోని సిర్గాపూర్ మండల కేంద్రంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులు పండుగ ఏర్పాట్లలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చిన్నారులంతా కలిసికట్టుగా పండుగ పనుల్లో పాలుపంచుకోవడం గ్రామస్తులను ఆనందానికి గురిచేస్తోంది. వారిలో భక్తితో పాటు సేవాభావం కూడా పెరుగుతోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి.

## కౌన్సిలర్ దశరథ్ రెడ్డి సొంత నిధులతో నీటి సమస్య పరిష్కారం

**పటాన్‌చెరు, మార్చి 27 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలోని పోతిరెడ్డిపల్లి 11వ వార్డులో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని అధిగమించడానికి, 11వ వార్డు కౌన్సిలర్ పొన్న దశరథ్ రెడ్డి తన సొంత నిధులతో బోరు బావిని తవ్వించి, మోటార్ బిగించి కాలనీ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతగా ఈ సమస్యను పరిష్కరించానని, భవిష్యత్తులోనూ ప్రజల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నానని కౌన్సిలర్ దశరథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, నాయకులు సుక్కరాజు, దామోదర్ రెడ్డి, మాధవరెడ్డి, మాణిక్ రెడ్డి, ప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

**అచ్చంపేట, మార్చి 27 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూర్ మండల పరిధిలోని డిండి-చింతపల్లి గ్రామ శివారులో దుందుభి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ౦ఆ 31౬0014 నెంబర్ గల ట్రాక్టర్ ను బ్లూ కోర్ట్ సిబ్బంది పట్టుకున్నారు. చింతపల్లి ట్రాక్టర్ డ్రైవర్ నీరటి రమేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తవ్వినా లేదా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# టర్మ్ ఇన్సూరెన్స్ తో రికార్డ్ క్రియేట్ చేస్తారా...

**హైదరాబాద్, మార్చి 27, పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వ బడ్జెట్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రకటన "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్". డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రకారం, 2026 జూన్ 2 నుంచి రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పేదలు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ ఈ పథకం వర్తిస్తుందనడం వల్ల ఈ హామీ సాధారణ సంక్షేమ పథకాన్ని మించిన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా ఆర్థికంగా కుంగిపోకుండా రక్షించే సోషల్ సెక్యూరిటీ స్కీం అనొచ్చు. ఉపముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్టు తెలంగాణ యే దేశంలో మొదటిదా అంటే కాదని చెప్పొచ్చు. ఎందుకంటే నాగాలాండ్ ఇప్పటికే పేరుతో 2024 ఆగస్టు 15న ఒక రాష్ట్రవ్యాప్త కుటుంబ-ఆధారిత బీమా మోడల్‌ను ప్రారంభించింది. ఆ పథకంలో కుటుంబ పోషకుడు మరణించినప్పుడు రూ.2 లక్షల జీవిత బీమా కల్పించింది. అయితే లబ్దిదారుల సంఖ్యాపరంగా చూస్తే కేవలం 2.5 లక్షల కుటుంబాలు మాత్రమే అంటే తెలంగాణ లబ్దిదారుల్లో అవి కేవలం 2.1 శాతం మాత్రమే.. అందువల్ల తెలంగాణ మొట్టమొదటి రాష్ట్రం కాదు కానీ కోటీ పదిహేను లక్షల కుటుంబాలు లక్ష్యంగా ఇంత పెద్ద స్థాయి పథకం మాత్రమే తెలంగాణ మాత్రమే అని చెప్పొచ్చు. ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనతో పోల్చితే... ౹వీజేజీదీ వ్యక్తిగత జీవిత బీమా పథకం. దానిలో ఏదేని కారణంతో బీమా పొందిన వ్యక్తి మరణిస్తే రూ.2 లక్షల కవరేజ్ ఉంటుంది. అందులో చేరేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు వారై ఉండాలి. ఈ పథకం బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతా ద్వారా, ప్రతి సంవత్సరం రూ.436 ప్రీమియం మన బ్యాంకు ఖాతా నుంచి ఆటో-డెబిట్ అవుతోంది. అంటే ఇది అందరికీ అందే సార్వత్రిక పథకం కాదు; వ్యక్తిగతంగా నమోదు చేసుకుని పథకంలో చేరితేనే వర్తిస్తుంది. తెలంగాణ ప్రకటించిన పథకం మాత్రం మరింత విస్తృతమైంది. ఇది కుటుంబం ఒక యూనిట్‌గా, రూ.5 లక్షలు బీమా కవరేజీ వర్తిస్తుంది. పైగా ప్రభుత్వం దీన్ని సంక్షేమ హామీగా ప్రకటిస్తోంది, ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ తేడా చిన్నది కాదు ఒకరకంగా చెప్పాలంటే ప్రజాసంక్షేమ విధానంలో చాలా పెద్ద ముందడుగు. "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్"కు సంబంధించిన పూర్తి విధి విధానాలింకా రూపొందించలేదు. కేంద్ర పథకం ౹వీజేజీదీతో తెలంగాణ స్కీమ్‌ను కలపగలరా అనే ఆలోచనపై ఇప్పటికెలాంటి స్పష్టతా లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పలు వెసులుబాట్లు పరిశీలించొచ్చు. ఒకటి, రాష్ట్రమే సొంతంగా ఒక గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం నడపడం. రెండోది, ౹వీజేజీదీని ఆసరా చేసుకుని దానికి రాష్ట్రం టాప్-అప్ కవరేజ్ ఇవ్వడం. మూడోది, అర్హులైన వారికి ప్రీమియం రాష్ట్రం చెల్లించి, మిగిలిన వర్గాలకు వేరుగా పథకం అమలుచేయడం. కానీ ఒక సమస్య ఉంది. ౹వీజేజీదీలో వయో పరిమితి, బ్యాంక్ ఖాతా, ఏశీఅంవత్, ఖఅఅఖుశ్రీ తీవఅవఖుశ్రీ వంటి షరతులు ఉన్నాయి. తెలంగాణ బడ్జెట్ ప్రసంగంలో మాత్రం "అందరికీ" అనే మాట ఉంది. కాబట్టి రాష్ట్రంపై భారం మాత్రం భారీగానే వుండొచ్చు. పేదల కోసం, గ్రామీణ భూమి లేని కుటుంబాల కోసం, అసంఘటిత కార్మికుల కోసం, ప్రమాద బీమా అవసరమున్న వర్గాల కోసం గతంలో ఇలాంటి పథకాలు వచ్చాయి. కానీ "ప్రతి కుటుంబానికి జీవిత బీమా" అనే స్థాయిలో, రాష్ట్రం అధికారికంగా పెద్ద ఎత్తున హామీ ఇవ్వడం మాత్రం తెలంగాణనే మొదటి రాష్ట్రం. అందుకే తెలంగాణ ప్రకటన రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకోనుంది. పైగా కేవలం పేదలకే పరిమితం కాకుండా మధ్యతరగతి, ఎగువ తరగతుల వారికీ బీమా అందించడం సంక్షేమ పథకాల అమలులో ఓ పెద్ద మలుపు.

ఐదు ప్రధాన సవాళ్లు

మొదటిది కుటుంబ నిర్వచనం- కుటుంబం అంటే ఎవరెవరు?

రెండోది కుటుంబ పోషకుడు గుర్తింపు- ఒక కుటుంబంలో ఇద్దరు సంపాదిస్తే? మహిళే ప్రధాన ఆదాయ వనరు అయితే?

మూడోది వయస్సు, రిస్క్, ప్రీమియం భారం వయస్సు పరిమితి లేకుండా పెద్ద ఎత్తున కవరేజ్ ఇస్తే ప్రీమియం ఖర్చు గణనీయంగా పెరగొచ్చు.


నాలుగోది లబ్దిదారుల జాబితా లబ్ధిదారుల డేటాబేస్ బలంగా లేకపోతే క్లెయిమ్‌ల వద్ద వివాదాలు మొదలవుతాయి.

ఐదోది, అంతకంటే ముఖ్యమైనది క్లెయిమ్ సెటిల్‌మెంట్ వేగం. ఇప్పటికే ఇలాంటి పథకం అమలవుతున్న నాగాలాండ్‌లో ఎదురవుతున్న ప్రధాన సవాలు.

మొత్తానికి పథకం విజయవంతంగా అమలైతే ఆరోగ్యశ్రీ పథకంతో రాజశేఖర్ రెడ్డికి, రైతు భీమా, రైతు బంధుతో కేసీఆర్‌కి వచ్చిన మంచి గుర్తింపు రేవంత్ రెడ్డికీ వస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగా తెలుగు రాష్ట్రం మరోసారి దేశానికి ఆదర్శంగా నిలవగల స్థాయి ఈ అందరికీ ఉచిత జీవిత బీమా పథకానికుంది. కాబట్టి అవరోధాలు లేకుండా అమలు చేయడంలోనే రేవంత్ సర్కార్ సత్తా నిరూపితమౌతుంది.

# ఇప్ప పువ్వు ఎక్కడ దొరుకుంది? ఎలా సేకరిస్తారు..?





**హైదరాబాద్, మార్చి 27, పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా సాగుతున్న పీక్ టైమ్‌లో ఇప్ప పువ్వు ప్రస్తావన, సభలో రేపిన దుమారం తెలంగాణ రాజకీయాలను షేక్ చేసింది. అధికార ప్రతిపక్షాల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, క్షమాపణల డిమాండ్‌లతో నిండు సభలో ఇప్ప చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్ప పువ్వు ప్రత్యేకత చాలా మందికి తెలియదు. ఇప్ప సారా పేరు వినే ఉంటారు, కొంతమంది ఇప్ప సారా రుచిని ఆస్వాదించి ఉంటారు. కానీ ఇప్ప పువ్వు అంటే కేవలం సారా మాత్రమే కాదు. ఇప్ప పువ్వు అంటే తెలంగాణ గిరిజనుల జీవనాధారం, ఆకలితో కడుపు మాడ్చుకునే అడవి బిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన అమృతాహారం. తెలంగాణలోని ములుగు, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోని గిరిజన తండాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇప్ప పువ్వు విరివిగా దొరుకుతుంది. ముఖ్యంగా ఉట్నూరు ఏజెన్సీలో ఇప్ప పువ్వుకు ఉండే క్రేజే వేరు. వేసవి కాలంలో ఇప్ప చెట్ల నుంచి ఇప్ప పువ్వులు రాలుతుంటాయి. అందుకే వేసవిని గిరజనులు ఇప్ప సీజన్‌గా పిలుస్తుంటారు. ఇప్ప చెట్లు చూసేందుకు మర్రి చెట్టు మాదిరి మహా వృక్షాల్లా ఉంటాయి. ప్రతీ కొమ్మకూ ఇప్పపువ్వులు విరగబడి పూస్తుంటాయి. చెట్టు ఎక్కకుండా నేలపై రాలిన ఇప్ప పువ్వులను మాత్రమే గిరిజనులు ఏరుతుంటారు. రాత్రంతా చెట్ల నుంచి రాలిన ఇప్ప పువ్వులను ఏరేందుకు వందల మంది గిరిజనులు ,భార్య పిల్లలతో కలసి తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచిన వెంటనే ఖాళీ కడుపుతో అడవి లోపలికి వెళతారు. సుమారు 8 నుంచి 10 కిలోమీటర్లు అడవిలోకి వెళితే తప్ప ఇప్ప చెట్లు కనిపించవు. అలా చెట్ల కింద రాలిన పువ్వులను ఏరుకుని , తిరిగి మధ్యాహ్నం 2గంటల సమయానికి ఇంటికి చేరుకున్న తరువాత మాత్రమే భోజనం చేస్తారు. అలా నెలలో 20రోజులపాటు ఇప్ప దొరికితేనే ఆరోజు గిరిజన బిడ్డల కడుపునిండేది.

**కిలో ఇప్ప పువ్వు ధర ఎంతంటే..?**

ఇప్ప పువ్వును సేకరించిన తరువాత నాలుగు నుంచి ఐదు రోజులపాటు ఎండబెట్టి, ఎండు ద్రాక్ష రంగులోకి మారిన తరువాత బస్తాలలో తొక్కి పెట్టి నిల్వ ఉంచుతారు. అలా ఎండబెట్టిన పువ్వు సంవత్సరంపాటు నిల్వ ఉంటుంది. అడవిలో నిర్వహించే సంతల్లో ఒక్క కిలో ఇప్ప పువ్వు 40 నుంచి 50 రూపాయలకు అమ్ముతుంటారు గిరిజనులు. క్వింటా ఇప్ప పువ్వు 5 నుంచి 6వేల రూపాయలకుపైగా ధర పలుకుతుంది.

**ఇప్ప పువ్వు ప్రయోజనాలు ఏంటి?**

ఇప్ప పువ్వుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయంటున్నారు ఆయుర్వేద నిపుణులు. వివిధ ఆయుర్వేద మందుల తయారీలోనూ ఇప్ప పువ్వును ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇప్ప పువ్వు రసం తీసుకోవడం వల్ల కడుపులో అల్సర్, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తొలిగిపోతాయి. ఇప్ప పువ్వును నీటిలో మరిగించి, ఆ నీటిని నోటిలో పుక్కిలి పట్టడం వల్ల నోటి పూత తగ్గుతుంది. ఇప్ప పువ్వు ఆయిల్ కీళ్ల నొప్పికి అద్భుతంగా పనిచేస్తుంది. పాలతో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. ఇప్ప పువ్వు రసంతో చర్మంపై దద్దుర్లు, దురద తగ్గుతాయి. ఇప్ప పువ్వుతో చేసే లడ్డూ, కుడుములతోపాటు వివిధ రకాల స్వీట్స్, గిరిజన వంటలు రుచిలో అద్భుతంగా ఉండటమే కాదు ఆరోగ్యానికి ఓ వరం.

**ఇప్ప సారా తయారీ విధానం, ఆరోగ్యంపై ప్రభావం**

అటవీ ప్రాంతాల్లో నిత్యం ఇప్పసారా కాయడం గిరిజన గ్రామాల్లో సర్వసాధారణం. వారం వారం నిర్వహించే గిరిజన సంతల్లో ఇప్ప సారాకు ఉండే ప్రత్యేకతే వేరు. మహానగరాలు, పట్టణాలతోపాటు దూర ప్రాంతాలను నుంచి సైతం ఇప్పసారా తాగేందుకు గిరిజన గ్రామాలకు క్యూ కడుతుంటారు. అంతలా ప్రత్యేకమైన ఇప్పసారా తయారీ విధానం వినూత్నంగా ఉంటుంది. ఎండబెట్టిన ఇప్ప పువ్వులను కడిగి రెండు లేదా మూడు రోజుల పాటు ఓ పాత్రలో నానబెడతారు. ఏ మాత్రం కదలకుండా ఇప్ప నీటిని పులయబెట్టిన తరువాత ,

ఓ పెద్ద పాత్రలో ఉంచి కట్టెల పొయ్యిపై కుండపైన కుండ పెడతారు. పులయబెట్టిన ఇప్పపువ్వు నీటి ఉంచిన పాత్ర కింద మంటపెడుతూ, ఆ పాత్రపైన మరో ఖాళీ కుండకు మధ్యలో సారా బయటకు వెళ్లేలా పైపు అమరుస్తారు. మట్టిపాత్రపైన మరో నీటి కుండను పెట్టి మంటపెడతారు. పులియబెట్టిన ఇప్ప పువ్వునీరు ఆవిరిగా మారి మధ్య కుండకు ఏర్పాటు చేసిన పైపు ద్వారా బయటకు వస్తుంది. అలా వచ్చే ఇప్పసారాను ఫైనల్ గా మరో పాత్రలోకి సేకరిస్తారు. ఇలా సేకరించిన ఇప్పసారా రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యంపై ఇప్పసారా చెడు ప్రభావం చూపనప్పటికీ, సారా సేవించడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ ఇక్కడ ఇప్ప సారా తాగడకుండా గిరిజనులే ఉండలేరు. ఇప్పసారా అంటే వీరి సంస్కృతిలో భాగం.

## యువతిపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

**జనగామ, మార్చి 27 పెన్ పవర్:** డిగ్రీ చదువుతున్న ఓ యువతిని పరిచయం చేసుకొని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి, ఆ తర్వాత పెళ్లి చేసుకోనని చెప్పిన నేలకంటి జోసెఫ్ తంబికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.ప్రేమలతారెడ్డి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజిపేట గ్రామానికి చెందిన జోసెఫ్ తంబి (26) ఎంబీఎం చదువుతుండగా తన గ్రామానికి చెందిన ఓ యువతి తన సోదరి ఇంటికి వచ్చి వెళ్తున్న క్రమంలో పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికంగా కలిశారు. ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలని ఆ యువతి కోరగా మాట దాట వేశాడు.

## విశ్వవిద్యాలయంపై వివక్ష

**డోర్నకల్, మార్చి 27 పెన్ పవర్:** కాకతీయ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర బడ్జెట్‌లో కొంత ఊరట లభించింది. ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కేయూ అధికారులు ఆశించినమేర కేటాయింపులు జరగలేదు. అయితే ఉద్యోగుల వేతనాలు, పింఛన్ల కోసం కేటాయించే బ్లాక్ గ్రాంట్ మాత్రం ఫర్వాలేదు అనిపించింది. గత పదేళ్ల నుంచి విశ్వవిద్యాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. గత పది ఆర్థిక సంవత్సరాల ప్రతి బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసేవరకు నయా పైసా విడుదల చేయలేదు. ఈసారి రూ.10 కోట్లకు తగ్గించి రూ.40 కోట్లు మాత్రమే కేటాయించారు.

# ఆర్థిక వ్యవస్థకు ఊతం ఐపీఎల్

**హైదరాబాద్ పెన్ పవర్:** క్రీడల ప్రపంచంలో వినోదం, వ్యాపారం, ప్రతిభ అనే మూడు ప్రధాన అంశాలను సమన్వయం చేసిన అత్యంత విజయవంతమైన క్రీడా వేదికగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిలిచింది. 2008లో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రారంభించిన ఈ లీగ్, మొదట ఎనిమిది జట్లతో ఆరంభమై, ప్రస్తుతం 10 జట్లతో విస్తరించి ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ఆదరణ పొందుతున్న టీ20 లీగ్‌గా ఎదిగింది. గత 18 సంవత్సరాల్లో ఐపీఎల్ కేవలం క్రికెట్ పోటీగా కాకుండా, భారత ఆర్థిక వ్యవస్థ, వినోద రంగం, మీడియా రంగాలపై ప్రభావం చూపిన భారీ వ్యవస్థగా రూపుదిద్దుకుంది. 2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో మొత్తం 59 మ్యాచ్‌లు నిర్వహించగా, ఇప్పుడు 2026 నాటికి సీజన్‌కు సగటున 70?74 మ్యాచ్‌లు నిర్వహించే స్థాయికి చేరుకుంది. ప్రారంభంలో జట్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల మ్యాచ్‌ల సంఖ్య కూడా పరిమితంగా ఉండేది. కానీ 2022లో రెండు కొత్త జట్ల చేరికతో మ్యాచ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2026 సీజన్‌లో 10 జట్లు, రెండు గ్రూపులుగా విభజించబడి లీగ్ దశలో ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడే విధంగా షెడ్యూల్ రూపొందించ బడింది. మొత్తం సీజన్‌లో 74 మ్యాచ్‌లు నిర్వహించడం ద్వారా అభిమానులకు మరింత విస్తృతమైన పోటీ అనుభవం అందుతోంది. జట్ల ప్రదర్శన పరంగా గణాంకాలను పరిశీలిస్తే, ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు 5 సార్లు (2013, 2015, 2017, 2019, 2020) విజేతగా నిలిచి అత్యధిక టైటిళ్లు సాధించిన జట్టుగా నిలిచింది. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ కూడా 5 టైటిళ్లతో సమాన స్థాయిలో ఉంది (2010, 2011, 2018, 2021, 2023). ఈ రెండు జట్లు ఐపీఎల్ చరిత్రలో అత్యంత స్థిరంగా ప్రదర్శన ఇచ్చిన జట్లుగా గుర్తింపు పొందాయి. కోల్కతా నైట్ రైడర్స్ 2 టైటిళ్లు,సన్ రైజర్స్ హైదరాబాద్ 1 టైటిల్, రాజస్తాన్ రాయల్స్ 1 టైటిల్ సాధించాయి. తాజా జట్లలో గుజరాత్ టైటాన్స్ తమ తొలి సీజన్‌లోనే టైటిల్ సాధించడం విశేషం. వ్యక్తిగత గణాంకాల పరంగా చూస్తే, ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు. అతను 7,500కు పైగా పరుగులు సాధించి, లీగ్ చరిత్రలో అత్యంత స్థిరమైన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. ఒకే సీజన్‌లో అత్యధిక పరుగులు (973) చేసిన రికార్డు కూడా అతనిదే (2016). బౌలింగ్ విభాగంలో యాజువేంద్ర చాహల్ మరియు డ్వేన్ బ్రావో వంటి ఆటగాళ్లు 180కు పైగా వికెట్లు తీసి అత్యుత్తమ బౌలర్లుగా నిలిచారు. ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉంది?కేవలం 30 బంతుల్లో శతకం (2013). 2026 సీజన్‌లో గమనించదగ్గ అంశం యువ ఆటగాళ్ల ప్రాబల్యం. అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు సగటున 150?180 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేస్తుండగా, బౌలింగ్‌లో 7- 8 ఎకానమీతో సమర్థవంతంగా బౌలింగ్ చేస్తున్నారు. పవర్‌ప్లేలో జట్లు సగటున 50- 60 పరుగులు సాధిస్తుండగా, డెత్ ఓవర్లలో ఒక్కో ఓవర్‌కు 10-12 పరుగుల రన్‌రేట్ నమోదవుతోంది. ఇది టీ20 ఫార్మాట్‌లో పెరిగిన దూకుడును సూచిస్తోంది. వేలం గణాంకాలు కూడా ఐపీఎల్ విస్తరణను ప్రతిబింబిస్తున్నాయి. 2008లో అత్యధికంగా 1.5 మిలియన్ డాలర్లకు ఆటగాళ్లు కొనుగోలు చేయబడగా, 2026 నాటికి ఈ మొత్తం 20 కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. స్టార్ ఆటగాళ్లతో పాటు యువ ఆటగాళ్లకూ భారీ ధరలు లభిస్తున్నాయి. జట్ల బడ్జెట్ సగటున 90-100 కోట్ల మధ్య ఉండటం ఐపీఎల్ ఆర్థిక శక్తిని తెలియ జేస్తుంది. ప్రసార హక్కుల పరంగా ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా నిలిచింది. 2023?2027 కాలానికి సంబంధించిన మీడియా హక్కులు సుమారు 48,000 కోట్లకు అమ్ముడయ్యాయి. ఒక్కో మ్యాచ్‌కు సగటున ?100 కోట్లకు పైగా విలువ ఉండటం విశేషం. టెలివిజన్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఒక్కో మ్యాచ్‌ను కోట్లాది ప్రేక్షకులు వీక్షిస్తున్నారు. 2026లో కూడా డిజిటల్ వీక్షణలు 40?50 కోట్ల మధ్య నమోదవుతున్నాయి.ఐపీఎల్ ప్రభావం భారత క్రికెట్‌పై అపారంగా ఉంది. దేశీయ స్థాయిలో రంజీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ వంటి టోర్నమెంట్‌లకు ప్రాధాన్యం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభ వెలుగులోకి రావడానికి ఐపీఎల్ ఒక వేదికగా మారింది.

ప్రతి సీజన్‌లో కనీసం 20?25 మంది యువ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ఎంపిక అవుతున్నారు.సాంకేతికత పరంగా కూడా ఐపీఎల్ ముందంజలో ఉంది. డీఆర్ఎస్ వినియోగం వల్ల అంపైరింగ్‌లో ఖచ్చితత్వం పెరిగింది. డేటా అనలిటిక్స్ ఆధారంగా జట్లు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. బ్యాట్స్‌మన్ షాట్ ఎంపిక నుండి బౌలర్ లైన్-లెంగ్త్ వరకు ప్రతిదీ డేటా ఆధారంగా విశ్లేషించ బడుతోంది. 2026లో +m ఆధారిత విశ్లేషణలు కూడా ప్రారంభమయ్యాయి.అయితే ఐపీఎల్‌పై విమర్శలు కూడా ఉన్నాయి. అధిక వాణిజ్యీకరణ వల్ల ఆట యొక్క అసలు సారాంశం దెబ్బతింటోందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఆటగాళ్లపై ఒత్తిడి పెరగడం, అంతర్జాతీయ షెడ్యూల్‌తో ఘర్షణలు రావడం వంటి సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ ఐపీఎల్ ప్రభావం తగ్గలేదు. మొత్తంగా 2026 ఐపీఎల్ సీజన్ గణాంకాల పరంగా, ప్రదర్శన పరంగా, ఆర్థిక పరంగా ఒక కీలక మలుపుగా నిలుస్తోంది. ప్రపంచ క్రీడా రంగంలో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపే శక్తిగా ఐపీఎల్ కొనసాగుతోంది. ప్రతిభకు వేదికగా, వినోదానికి కేంద్రంగా, ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే వ్యవస్థగా ఐపీఎల్ భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ ప్రచారం

**హైదరాబాద్, మార్చి 27, పెన్ పవర్:** తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. అయినా పొత్తుల ఊహాగానాలు మాత్రం ఊపందుకున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయంటూ కొంతకాలంగా గుసగుసలు జోరందుకున్నాయి. ఇందుకు కొంతమంది నేతల వ్యాఖ్యలు కూడా కారణం. అయితే పొత్తుపై అటు బీజేపీ కానీ, ఇటు బీఆర్ఎస్ కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటనలూ చేయట్లేదు. నేతల మాటలతో ఇలాంటి ఊహాగానాలు మాత్రం రోజురోజుకూ బంధంపై బలపుడుతున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. అనంతరం జరిగిన మున్సిపల్, లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ పై పైచేయి సాధించలేకపోయింది. దీంతో కాంగ్రెస్ ను ఎదుర్కోవాలంటే బీజేపీతో కలిసి పోటీ చేస్తే బాగుంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పటివరకూ బీఆర్ఎస్ నుంచి అధికారికంగా ఎలాంటి సంకేతాలూ లేవు.మరోవైపు బీజేపీలో కూడా కొంతమంది నేతలు బీఆర్ఎస్ తో పొత్తుపై కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఈ తరహా కామెంట్స్ చేశారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు కానీ, శాశ్వత శత్రువులు ఉండరన్నారు. గతంలో టీడీపీతో పొత్తు పెట్టుకుని, విడిపోయి, మళ్ళీ కలిసిన ఉదాహరణలను ఆయన గుర్తు చేస్తున్నారు. “నడవడానికి ఒక కాలు ఇబ్బందిగా ఉన్నప్పుడు మరో కాలు సాయం తీసుకోవడంలో తప్పులేదు” అనే సిద్ధాంతాన్ని ఆయన తెరపైకి తెచ్చారు. బీఆర్ఎస్ తో కలిస్తే తెలంగాణలో అధికారంలోకి రావడం సులభం అవుతుందనేది ఈ వర్గం ఆలోచన.అయితే బీజేపీలోనే బీఆర్ఎస్ తో పొత్తును వ్యతిరేకించే వాళ్లు కూడా ఉన్నారు. పాయల్ శంకర్ వంటి నేతలు ఈ



ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీఆర్ఎస్ ను ఒక చచ్చిన శవంతో పోలుస్తూ, ఆ పార్టీ మళ్ళీ కోలుకునే అవకాశం లేదంటున్నారు. అటువంటి పార్టీతో పొత్తు అవసరం లేదని వారు ఖరాకండిగా చెబుతున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని చాలాకాలంగా విమర్శిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పైన బీజేపీ ఎమ్మెల్యే పిటిషన్ వేయడం, ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు క్లీన్ చీట్ ఇవ్వడం లాంటి వాటిని కాంగ్రెస్ ఇందుకు ఉదాహరణలుగా చెప్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో ఆ రెండూ జట్టుకట్టి వచ్చినా కూడా ఓడిస్తానని ప్రకటించారు. అంతేకాదు.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓడించేందుకు ఆ రెండూ తప్పకుండా కలుస్తాయని హస్తం నేతలు గట్టిగా భావిస్తున్నారు.మరోవైపు బీజేపీలోని కొంతమంది కీలక నేతలు, బీఆర్ఎస్ తో పొత్తుకు అనుకూలంగా ఉన్నారని సమాచారం. బీఆర్ఎస్ కోసమే బీజేపీని ఎదగకుండా అడ్డుకుంటున్నారని కమలం పార్టీలోనే కొంతమంది నేతలు అధిష్టానానికి ఫిర్యాదులు సైతం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ తో పొత్తుకు బీజేపీ ఏ మేరకు ఒప్పుకుంటుందనేది ఆసక్తికరం.కానీ రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. అవసరాలకోసం ఎవరైనా, ఎప్పుడైనా, ఎవరితోనైనా కలిసే అవకాశం ఉంటుంది. కాబట్టి బీజేపీ బీఆర్ఎస్ కలవచ్చు.. కలవకపోవచ్చు. ఇవన్నీ ఎన్నికల లెక్కలు, సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది. అయితే ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేవు కాబట్టి ఈ పొత్తుపై ఇప్పుడే అంచనాకు రాలేం. ముమ్ముందు ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# పెట్రోల్ కష్టాలకు కారణం ఎవరు?

**హైదరాబాద్, మార్చి 27, పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటం సామాన్య వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని అటు కేంద్ర పెట్రోలియం శాఖ, ఇటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చెబుతున్నప్పటికీ, బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రభుత్వ లెక్కల్లో నిల్వలు పుష్కలంగా ఉన్నా, అవి వినియోగదారుడి వాహనం దాకా చేరకపోవడమే అసలు సమస్యగా మారింది.ఉన్నప్పటికీ బంకులకు చేరకపోవడానికి ప్రధాన కారణం ‘సప్లై చైన్‘ లేదా రవాణా వ్యవస్థలో తలెత్తిన లోపాలేనని తెలుస్తోంది. చమురు కంపెనీల డిపోల నుండి బంకులకు ఇంధనాన్ని చేరవేసే ట్యాంకర్ల లభ్యత తగ్గడం లేదా రవాణా కాంట్రాక్టర్ల మధ్య తలెత్తిన సమన్వయ లోపం వల్ల సకాలంలో లోడింగ్ జరగడం లేదని చెబుతున్నారు. అయితే ముందుగానే డబ్బులు చెల్లించాలని మార్చిన నిబంధనల వల్ల కూడా.. పెట్రోల్ బంకులకు తగినంత ఇంధనం అందడం లేదనిచెబుతున్నారు. కొరత ఉందన్న చిన్నపాటి వదంతులు సోషల్ మీడియాలో వ్యాపించగానే, వాహనదారులు తమ అవసరానికి మించి ఇంధనాన్ని నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా రోజూ 5 వేల లీటర్లు అమ్ముడయ్యే బంకులో, ఒకేసారి 15 వేల లీటర్ల డిమాండ్ రావడం వల్ల నిల్వలు త్వరగా అయిపోతున్నాయి. ఇదే క్రమంలో




కొంతమంది బంకు నిర్వాహకులు ధరలు పెరుగుతాయన్న ఆశతో లేదా ముందస్తు జాగ్రత్తగా స్టాక్ ఉన్నా లేదని చెబుతూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.నిల్వలు ఉన్నాయని ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమైన ప్రభుత్వ యంత్రాంగం, క్షేత్రస్థాయిలో తనిఖీలను విస్మరించిందన్న విమర్శలు వస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు బంకుల్లోని నిల్వలను తనిఖీ చేసి, స్టాక్ ఉండి కూడా అమ్మని వారిపై చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. డిపోల వద్ద ట్యాంకర్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేసేలా చమురు కంపెనీలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమవ్వడం వల్లే ఈ అనిశ్చితి కొనసాగుతోంది. ప్రస్తుత సంక్షోభం తొలగాలంటే కేవలం ప్రకటనలు సరిపోవు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపి, ప్రతి బంకులో ఉన్న నిల్వలపై పారదర్శకత తీసుకురావాలి. ట్యాంకర్ల రవాణాను యుద్ధ ప్రాతిపదికన క్రమబద్ధీకరించి, రాత్రిపూట కూడా లోడింగ్ జరిగేలా చూడాలి. ప్రజల్లో ధైర్యం నింపేలా ప్రతి బంకు వద్ద అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను డిజిటల్ బోర్డుల ద్వారా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

## భద్రాచలం సీతారాముల కళ్యాణంలో సీఎం రేవంత్ రెడ్డి

**కొత్తగూడం, మార్చి 27 పెన్ పవర్:** భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా తొలి విడతలో రూ.351కోట్లతో చేపట్టబోయే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## లక్షల మంది భక్తజనంతో కిక్కిరిసిన మిథిలా స్టేడియం

**పినపాక, మార్చి 27 పెన్ పవర్:** దక్షిణ అయోధ్య భద్రాద్రిలోని మిథిలా స్టేడియంలో రాములోరి పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరుగుతోంది. స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు లక్షల మంది భక్తులు తరలిరావడంతో స్టేడియం పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ‘జైశ్రీరామ్’ నినాదాలు మిన్నంటాయి. తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## భద్రాద్రి రామయ్యకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి

**అశ్వారావుపేట, మార్చి 27 పెన్ పవర్:** భద్రాద్రి రామయ్య పెళ్లి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ అధికారులతో కలిసి అంతరాలయంలో స్వామివారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాద్రికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## బయలుదేరిన భద్రాద్రి రామయ్య

**ఇల్లందు, మార్చి 27 పెన్ పవర్:** భద్రాద్రి రాములవారి కళ్యాణ వేడుకలు మిథిలా స్టేడియంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతరాలయం నుంచి స్వామివారు కళ్యాణ వేదికకు చేరుకున్నారు. ‘జై శ్రీరామ్’ నినాదాలతో పరిసరాలు మారుమోగుతున్నాయి.

## ఆలయంలో బూట్లతో బౌన్సర్లు భక్తుల ఆగ్రహం

**జనగామ, మార్చి 27 పెన్ పవర్:** వరంగల్ కాశిబుగ్గ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా, రాముల వారి కళ్యాణం జరుగుతున్న ప్రాంగణంలో బౌన్సర్లు బూట్లు ధరించి ఉండడం భక్తులను ఆగ్రహానికి గురి చేసింది. ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఓరుగల్లు మహిళకు అరుదైన గౌరవం



**వర్ధన్నపేట, మార్చి 27 పెన్ పవర్:** హనుమకొండకు చెందిన ప్రవాస భారతీయురాలు హేమ ఎల్లాప్రగడ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యూకేలోని వార్విక్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌కు 2023లో అధికార గ్రీన్ పార్టీ సభ్యురాలిగా ఎన్నికైన ఆమె తాజాగా క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికయ్యారు. స్థానిక నగరాల్లో పాలన సాగించేందుకు డిస్ట్రిక్ట్ కౌన్సిల్స్ ఉంటాయి. డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌లో అత్యధిక స్థానాలు గెలుపొందిన పార్టీ నేతను లీడర్ ఆఫ్ ది కౌన్సిల్‌గా పిలుస్తారు. సభ్యుల్లో కొందరిని క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేసి వివిధ పరిపాలనా విభాగాలను అప్పగిస్తారు. అలాగే హేమ ఎల్లాప్రగడకు ఇప్పుడు డీకార్బనైజేషన్ బాధ్యతలు అప్పగించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

**స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 27 పెన్ పవర్:** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని టేకులగూడెం ఓఆర్ఆర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ఎడమ కాలు విరిగి, అధిక రక్తస్రావం జరిగింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో, కాజీపేట నుండి అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుంది. ఇఓ చైతన్య, పైలట్ కుమారస్వామి సంఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి, మహిళను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సిద్ధార్థకు మరోసారి పట్టాభిషేకం



**మహబూబాబాద్, మార్చి 27 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జంగం సిద్ధార్థ వరుసగా రెండోసారి ప్రధాన కార్యదర్శిగా ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన తోటి న్యాయవాదులకు, సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్ కేంద్రంగా జరిగిన ఈ ఎన్నికల్లో ఆయన విజయం న్యాయవాద వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# త్రేతాయుగపు ఆనవాళ్లతో రామలింగేశ్వరాలయం

**మంచిర్యాల, మార్చి 27 పెన్ పవర్:** పాత మంచిర్యాల లోని రామలింగేశ్వర ఆలయానికి పురాణ ప్రాశస్త్యం ఉందని స్థానికులు తెలిపారు. త్రేతాయుగంలో శ్రీ సీతారాములు గోదావరి తీరం వెంబడి వనవాసం చేస్తున్న సమయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారని భక్తుల నమ్మకం. ఆలయ నిర్మాణంలో వానర సైన్యం పాలుపంచుకుందని, దానికి సంబంధించిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయని చెబుతున్నారు. ఈ ఆలయానికి వందల ఎకరాల మాగాణి, 'రాముని చెరువు' కూడా చెందుతుందని వివరించారు.

## లంచం అడిగితే లాక్ షురూ !

**బెల్లంపల్లి, మార్చి 27 పెన్ పవర్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవినీతి అధికారులకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సింహస్వప్నంగా మారింది. తాజాగా మామడ ఎస్సై అశోక్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటంతో జిల్లాలో కలకలం రేగింది. గతంలో కూడా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో రెవెన్యూ, విద్యుత్ శాఖాధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. ప్రజలు చైతన్యంతో 1064 నెంబర్‌కు ఫిర్యాదు చేసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకునేలా ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

### చీకలి వాగులో మళ్లీ అక్రమ ఇసుక రవాణా-

## ఎస్పీ హెచ్చరికలు భేఖాతర్

**చెన్నూరు, మార్చి 27 పెన్ పవర్:** వాంకిడి మండల కేంద్రంలోని చీకలి వాగులో మరోసారి అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. జిల్లా ఇసుక రవాణాపై కఠిన నిఘా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ ప్రకటించిన 24 గంటల్లోనే ట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నాయి. శ్రీరామనవమి సెలవు రోజున అధికార అనుమతులు లేకున్నా ఈ తరలింపు కొనసాగడం గమనార్హం. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుని ఇసుక మాఫియాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జన్కపూర్ కోదండరామాలయంలో బీసీ సంక్షేమ సంఘం ప్రత్యేక పూజలు

**ఆసిఫాబాద్, మార్చి 27 పెన్ పవర్:** కొమురంభీం జిల్లాలోని జన్కపూర్ కోదండరామాలయంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకం అనంతరం స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో భక్తులతో మాట్లాడి శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని కోరుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

**సిర్పూర్, మార్చి 27 పెన్ పవర్:** కొమరంభీం జిల్లా, ఆసిఫాబాద్‌లో అక్రమ కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. గత రెండు రోజుల్లో పలు కేసులు నమోదయ్యాయి. ఇస్గాం ప్రాంతంలో ఎక్స్‌టార్షన్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఈ మేరకు ఎస్పీ నితికా పంత్ వివరాలు వెల్లడించారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనివేళల పొడిగింపు

**జగిత్యాల, మార్చి 27 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనివేళలను ప్రభుత్వం పొడిగించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 నుంచి రాత్రి 8:30 గంటల వరకు స్లాట్లు అందుబాటులో ఉంటాయని రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన సమయానికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## కొనుగోలు కేంద్రం వివాదం పరిష్కరించాలని వినతి

**కోరుట్ల, మార్చి 27 పెన్ పవర్:** జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లి గ్రామ నాయకులు, ప్రజలు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిశారు. వంజరుపల్లి గ్రామ శివారులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన స్థలం విషయంలో సరిహద్దు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు ఫోన్ చేసి, గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు.

## వేంపల్లిలో అయోధ్య శ్రీరామ రథానికి ఘన స్వాగతం

**ధర్మపురి, మార్చి 27 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా, కోరుట్ల, జగిత్యాలలోని మల్లాపూర్ మండలం వేంపల్లిలో అయోధ్య నుండి వచ్చిన శ్రీరాముని రథానికి ఘన స్వాగతం లభించింది. శ్రీరామనవమి రోజున రామ రథం రావడం అదృష్టంగా భావించిన మహిళామణులు, హనుమాన్ స్వాములు, గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. పూజారులు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించగా, రథాన్ని ఊరేగించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు కొడుతూ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, హనుమాన్ స్వాములు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీతారామ కళ్యాణ మహోత్సవ ఊరేగింపు ఘనంగా నిర్వహణ

**పెద్దపల్లి, మార్చి 27 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం, శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ స్వయంభు రాజరాజేశ్వరి దేవస్థాన ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ మహోత్సవ ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఓరుగల అరుణ, దేవస్థాన చైర్మన్ ఓరుగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మపురి ప్రాంతంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం ఇదే..!

**మంథని, మార్చి 27 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సందరెల్లి గ్రామ శివారులోని మానేరు నది తీరాన ఉత్తర ముఖంతో ఉన్న పురాతన రామలింగేశ్వర ఆలయం నేడు శిథిలావస్థలో ఉంది. శ్రీరాముడు స్వయంగా ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించాడని స్థల పురాణం చెబుతోంది. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి, శివరాత్రి పండుగలకు స్వామివారి కళ్యాణ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇదే ప్రాంగణంలో కాకతీయులు నిర్మించిన త్రికూట శివాలయం కూడా ఉంది. ఇంతటి చారిత్రక వైభవం కలిగిన ఆలయం నిర్లక్ష్యానికి గురైంది.

## కోదండ రామాలయంలో కలెక్టర్ పూజలు

**రామగుండం, మార్చి 27 పెన్ పవర్:** శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం పెద్దపల్లి శాంతినగర్ లోని శ్రీ కోదండ రామాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన కుటుంబంతో కలిసి శ్రీ సీతారాముల స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, 1వార్డు కౌన్సిలర్ పురేల్ల శైలజ సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు ముడుసు సాంబిరెడ్డి, సారథి రెడ్డి, దొంతిరెడ్డి కర్ణాకర్ రెడ్డి, ఆమనగంటి శ్రీనివాస్ రెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

## గుట్కా, మద్యం అక్రమ విక్రయాలపై అధికారుల కొరడా



**ఉప్పల్, మార్చి 27 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ఉప్పల్, మల్లాపూర్, కుషాయిగూడ ప్రాంతాల్లో గుట్కా, మద్యం అక్రమ విక్రయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లలో అక్రమ గుట్కా నిల్వలు, మద్యం సరఫరాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పునర్విభజనతో మారనున్న దేశ ముఖచిత్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజకీయ యవనికపై త్వరలో సంభవించబోయే అత్యంత కీలకమైన, చారిత్రాత్మకమైన పరిణామం నియోజకవర్గాల పునర్విభజన. ఇది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును, అధికార సమతుల్యతను, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని సమూలంగా ప్రభావితం చేసే ఒక బృహత్తర ప్రక్రియ. జనసంఖ్యలో వస్తున్న మార్పులు, ప్రాంతీయంగా నెలకొన్న అసమానతలు, మారుతున్న సామాజిక ముఖచిత్రం నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సిన ఈ ప్రక్రియ ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను చర్చకు దారితీసింది. ముఖ్యంగా 2029 సాధారణ ఎన్నికల నాటికి నూతన నియోజకవర్గాల ఏర్పాటును పూర్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పం, లోకసభ స్థానాల సంఖ్యను 543 నుండి ఏకంగా 816కి పెంచే ప్రతిపాదనలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో శాసనసభ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుండటం ఆయా రాష్ట్రాల రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేసే అవకాశముంది. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే అధికారిక జనగణన (సెన్సస్) ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అయితే, గతంలో అమలు చేసిన కుటుంబ నియంత్రణ విధానాల వల్ల జనాభా తగ్గుముఖం పట్టిన రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో, 1971 జనగణన ప్రాతిపదికన ఏర్పడిన స్థానాలనే 2001 వరకు, ఆ తర్వాత 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 వరకు స్తంభింపజేశారు. ప్రస్తుతం 2026 గడువు సమీపిస్తుండటంతో, తదుపరి జరిగే జనగణన ఆధారంగా ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. సాంకేతికంగా 2031 జనగణన దీనికి ప్రామాణికం కావాల్సి ఉన్నప్పటికీ, పరిపాలనా సౌలభ్యం మరియు రాజకీయ వ్యూహాల నేపథ్యంలో 2029 నాటికే ఈ మార్పులను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోకసభ స్థానాల సంఖ్యను సుమారు 50 శాతం పెంచి 816కి చేర్చడం ద్వారా ప్రతి ఎంపీ ప్రాతినిధ్యం వహించే జనాభా పరిమాణాన్ని తగ్గించి, ప్రజలకు – ప్రతినిధులకు మధ్య దూరాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ భారీ మార్పు కేవలం అంకెల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, ఇది దేశ సమాఖ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు అధికంగా ఉండటం వల్ల, పునర్విభజన అనంతరం ఆ రాష్ట్రాలకు దక్కే లోకసభ సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనికి విరుద్ధంగా, దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి జనాభాను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ వైరుధ్యాలకు, నిధుల కేటాయింపులో అసమానతలకు దారితీస్తుందన్నది రాజ్యాంగ నిపుణుల హెచ్చరిక. ఓటు హక్కు వినియోగించుకునే పౌరుల సంఖ్య ప్రాతిపదికన సీట్లు పెంచడం ప్రజాస్వామ్య సూత్రమే అయినప్పటికీ, బాధ్యతాయుతమైన రాష్ట్రాలు రాజకీయంగా శిక్షకు గురికాకుండా చూడటం కేంద్రం ముందున్న అతిపెద్ద సవాలు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, పునర్విభజన ప్రక్రియ అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుంది. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాలను 179కి పెంచాలనే ప్రతిపాదన ఉంది. రాష్ట్ర ఏర్పాటు సమయంలోనే జనాభా నిష్పత్తి ప్రకారం సీట్ల పెంపు అవసరమని రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలు భౌగోళికంగా పెద్దవిగా ఉండటం, కొన్ని ప్రాంతాల్లో జనాభా సాంద్రత విపరీతంగా పెరగడం వల్ల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా 60 స్థానాలు పెరగడం వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు మెరుగైన ప్రాతినిధ్యం లభిస్తుంది. ఇది కొత్త నాయకత్వం ఉద్భవించడానికి మార్గం సుగమం చేస్తుంది. అయితే, ఇదే సమయంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన పాత రాజకీయ సమీకరణాలు చెల్లాచెదురవుతాయి. సామాజిక వర్గాల వారీగా ఓటు బ్యాంకులు చీలిపోయే అవకాశం ఉండటంతో, రాజకీయ పార్టీలు తమ వ్యూహాలను మొదటి నుండి సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 శాసనసభ స్థానాలు 263కి పెరిగే అవకాశం ఉండటం ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అనేక ఆర్థిక, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా అభివృద్ధి ఫలాలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. చిన్న నియోజకవర్గాలు ఏర్పడటం వల్ల శాసనసభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలపై మరింత దృష్టి సారించే వీలుంటుంది. రాజకీయంగా చూస్తే, సీట్ల సంఖ్య పెరగడం వల్ల టికెట్ల కోసం పార్టీల్లో ఉండే అంతర్గత విభేదాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, కొత్తగా ఏర్పడే స్థానాల్లో ఏ సామాజిక వర్గం ఆధిపత్యం చెలాయిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వ్ చేయబడే స్థానాల సంఖ్య కూడా పెరగడం వల్ల సామాజిక న్యాయం మరింత సమర్థవంతంగా అమలయ్యే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 'డిలిమిటేషన్ కమిషన్' అనే అత్యున్నత స్వతంత్ర సంస్థ నిర్వహిస్తుంది. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో పనిచేసే ఈ కమిషన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు, రాష్ట్రాల ఎన్నికల అధికారులు సభ్యులుగా ఉంటారు. జనాభా ప్రాతిపదికన సరిహద్దులను నిర్ణయించేటప్పుడు భౌగోళిక విస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం, కమ్యూనికేషన్ సౌకర్యాలను ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదికకు చట్టబద్ధమైన రక్షణ ఉంటుంది. దీనిని ఏ కోర్టులోనూ సవాలు చేయడానికి వీలుండదు. ఈ నిబంధన రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడానికి ఉద్దేశించినదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికార పార్టీలు తమకు అనుకూలమైన ప్రాంతాలను కలుపుకోవడం లేదా వ్యతిరేక ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతాలను విడదీయడం వంటి 'గెర్రీమాండరింగ్' (ఉవతీతీఎజీనిటవతీతినిణ) చర్యలకు పాల్పడతాయనే విమర్శలు ఎప్పుడూ ఉంటాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గాల విభజన తీరు ఓటర్ల ప్రభావాన్ని మార్చివేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఈ మార్పుల కోసం ముందుచూపుతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనం (సెంట్రల్ విస్టా)లో సభ్యుల సీటింగ్ సామర్థ్యాన్ని పెంచడం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. లోకసభలో 888 మంది, రాజ్యసభలో 384 మంది కూర్చునేలా అత్యాధునిక వసతులతో భవనాన్ని సిద్ధం చేయడం ద్వారా, భవిష్యత్తులో పెరగబోయే సభ్యుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఇప్పటికే కల్పించారు. ఇది కేవలం భవన నిర్మాణం మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య పరిమాణం విస్తరిస్తుందనే సంకేతం. అయితే, ఈ విస్తరణలో ఆత్మవంచన చేసుకోకుండా, అన్ని రాష్ట్రాల హక్కులను కాపాడటం ముఖ్యం. దక్షిణ రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యసభ స్థానాల కేటాయింపులో లేదా ఆర్థిక సంఘం నిధుల పంపిణీలో ప్రత్యేక వెసులుబాటు కల్పించడం ద్వారా సమాఖ్య స్ఫూర్తిని చాటుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఈ పునర్విభజన ప్రక్రియ వల్ల మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా మార్గం సుగమం కానుంది. లోకసభ, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలు కావాలంటే పునర్విభజన తప్పనిసరి. సీట్ల సంఖ్య పెరగడం వల్ల పురుష అభ్యర్థుల అవకాశాలకు పెద్దగా భంగం కలగకుండానే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే వీలుంటుంది. ఇది భారత రాజకీయాల్లో లింగ సమానత్వాన్ని సాధించడానికి ఒక గొప్ప అవకాశం. అదేవిధంగా, కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత పెరుగుతుంది. పెద్ద నియోజకవర్గాల్లో సామాన్య కార్యకర్తలు నాయకులుగా ఎదగడం కష్టం, కానీ చిన్న నియోజకవర్గాల్లో ప్రజాబలం ఉన్న వ్యక్తులు అసెంబ్లీకి లేదా పార్లమెంటుకు ఎన్నికయ్యే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ముగింపుగా చూస్తే, 2029 నాటికి అమలులోకి రానున్న నియోజకవర్గాల పునర్విభజన అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మహా క్రతువు. ఇది కేవలం ఓటర్ల సంఖ్యను సరిచేయడం మాత్రమే కాదు, దేశ రాజకీయ దిశను మార్చే కీలక మలుపు. జనాభా ప్రాతిపదికన ప్రతినిధుల సంఖ్యను పెంచడం ద్వారా పౌరుల గొంతుకకు మరింత బలం చేకూరుతుంది. అయితే, ఈ ప్రక్రియలో ప్రాంతీయ అసమానతలు తలెత్తకుండా, అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా చూడటం అత్యవసరం. తెలంగాణలో 179, ఆంధ్రప్రదేశ్‌లో 263 స్థానాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయాలు నూతన ఉత్సాహాన్ని సంతరించుకోనున్నాయి. రాజకీయ పార్టీలు తమ పాత మూస పద్ధతులను వీడి, మారుతున్న సరిహద్దులకు, మారుతున్న సమీకరణాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవాలి. పారదర్శకతతో, శాస్త్రీయ దృక్పథంతో ఈ పునర్విభజన పూర్తయితే, అది భారత ప్రజాస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన వ్యవస్థగా తీర్చిదిద్దుతుందనడంలో సందేహం లేదు.ం

# రేవంత్ మార్క్ పాలిటిక్స్

**హైదరాబాద్, మార్చి 27, పెన్ పవర్:** తెలంగాణ గడ్డపై పాలనతో బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి హస్తినలో అడుగుపెట్టగానే రూటు మారుస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు ఆయన ఎంచుకున్న సరికొత్త ఆయుధం.. 'డీలిమిటేషన్' (నియోజకవర్గాల పునర్విభజన). దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలే పరమావధిగా ఆయన వినిపి స్తున్న నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్య పెరుగుతుంది. ఇక్కడే రేవంత్ రెడ్డి ఒక బలమైన పాయింట్‌ను తెరపైకి తెచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్రం చెప్పినట్లు కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను అదుపు చేశాయి. కానీ, ఇప్పుడు జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకే (యూపీ, బీహార్ వంటివి) ఎక్కువ ఎంపీ సీట్లు కేటాయిస్తే, అది క్రమశిక్షణ పాటించిన దక్షిణాదికి అన్యాయం చేసినట్లే అవుతుంది. "అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు శిక్ష.. జనాభా పెంచిన వారికి బహుమతా?" అన్న రేవంత్ ప్రశ్న ఇప్పుడు దక్షిణ భారతాన్ని ఆలోచింపజేస్తోంది. రేవంత్ రెడ్డి తీస్తున్న ఈ 'సౌత్ సెంటిమెంట్' కాంగ్రెస్ అధిష్టానాన్ని ఇరకాటంలో పడేస్తోంది. నార్త్ వర్సెస్ సౌత్ గా పరిస్థితి మారుతోంది. రేవంత్ వ్యాఖ్యలను గట్టిగా సమర్థిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లు తమను కించపరుస్తున్నారని భావించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ ఉత్తరాదిన పార్టీని బలోపేతం చేయాలని చూస్తున్న తరుణంలో ఈ ప్రాంతీయ భేదాలు పార్టీ జాతీయ ప్రతిష్టకు విఘాతం కలిగించవచ్చు. అందుకే రేవంత్ దూకుడుపై అధిష్టానం ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ముద్ర వేయకుండా ఆచితూచి అడుగులు వేస్తోంది. గతంలో కేసీఆర్ కూడా జాతీయ రాజకీయాల కోసం 'బీఆర్ఎస్' పెట్టి చేతులు కాల్చుకున్నారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే రేవంత్ వ్యూహం భిన్నంగా ఉంది. ఆయన కేవలం పార్టీ లైన్ కాకుండా ప్రాంతీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. దక్షిణాది ఎంపీల సంఖ్య తగ్గితే భవిష్యత్తులో కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతాయని ఆయన హెచ్చరిస్తున్నారు. కేసీఆర్ మాదిరిగా ఉత్తరాదిలో పార్టీని విస్తరించడం కంటే, దక్షిణాది నేతలను ఏకం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవడమే రేవంత్ అసలు ప్లాన్ అని అర్థమవుతోంది. ఉత్తరాదిన తిరుగులేని బలం ఉన్న బీజేపీకి, రేవంత్ లేవనెత్తిన ఈ అంశం పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాలు నిజంగానే ఏకతాటిపైకి వస్తే, అది బీజేపీకి దక్షిణాదిన అడ్డుగోడగా మారుతుంది. అయితే, ఇదే సమయంలో రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ తమకు అనుకూలంగా మలుచుకుని "కాంగ్రెస్ దేశాన్ని విభజిస్తోంది" అనే ప్రచారాన్ని నార్త్ ఇండియాలో మొదలుపెట్టే ఛాన్స్ కూడా ఉంది. రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'దక్షిణ సెంటిమెంట్' రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఇది కేవలం సీట్ల పెంపు అంశమే కాదు.. భవిష్యత్తు భారత రాజకీయాల గమనాన్ని మార్చే కీలక పరిణామం. రేవంత్ రెడ్డి ఈ పోరాటంలో దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేయగలరా? లేదా జాతీయ రాజకీయాల ఒత్తిడిలో తన స్వరాన్ని తగ్గించుకుంటారా? అనేది కాలమే నిర్ణయించాలి.

# రాజధానిగా రాజముద్ర..

**అమరావతి, మార్చి 27, పెన్ పవర్:** వేల కోట్లతో నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం. మిషన్ మోడ్‌లో పనులు. పెద్ద పెద్ద టవర్లు. ఇంటర్నేషనల్ లెవల్ స్టాండర్డ్స్‌తో నిర్మాణాలు. ఇలా ఏడాదిన్నరగా అమరావతి అన్‌స్టాపబుల్ అన్నట్లుగా దూసుకెళ్తోంది. గతానికి మించి కొత్త కలతో కళకళలాడటమే కాదు..సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. కానీ ఒక్కటే బాకీ ఉంది. అదే రాజధాని రాజముద్ర. రాజముద్ర పడితే ఇక నో ప్రాబ్లమ్. ఇటు రైతులు..అటు సీఎం చంద్రబాబు అందరి మదిలో ఉన్నమాట ఇది. ఇందుకోసం కూటమి సర్కార్ చేసిన ప్రయత్నాలన్నీ ఫైనల్ స్టేజ్‌కు చేరి..అమరావతికి హోదా దక్కేందుకు రూట్ క్లియర్ అవుతోంది.కూటమి సర్కార్ ప్రెజర్..కేంద్ర ప్రభుత్వ చర్యలు అన్నట్లుగా డెవలప్‌మెంట్ నడిచింది. కానీ సడెన్‌గా ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం అంటూ నోటిఫికేషన్ రిలీజ్ అయింది. ఈ నెల 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశమై..ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని గుర్తించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయనుంది. ఆ తీర్మానానికి గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే నోటిఫికేషన్ జారీ కానుంది. దాన్ని కేంద్రానికి పంపించనుంది ఏపీ సర్కార్. ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే విభజన చట్ట సవరణ బిల్లు పెట్టి..అమరావతిని ఏపీ రాజధానిగా బిల్ పాస్ చేయనున్నారు.అయితే రాజధానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపితే చాలు అంటున్నారు. కానీ ఫ్యూచర్‌లో సమస్యలు రాకుండా ఉండాలంటే అసెంబ్లీలో తీర్మానం చేయడమే బెటర్ అని భావిస్తున్నారట. పీఎంవో నుంచి అందిన సూచనల ప్రకారమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి తీర్మానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారట. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం ఇప్పటికే సానుకూలంగా స్పందించింది. కేంద్రం డౌట్స్ అన్నింటిని క్లారిఫై చేసిన ఏపీ ప్రభుత్వం పూర్తి సమాచారాన్ని అందజేసింది. ఈ క్రమంలోనే ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే



రాష్ట్ర విభజన చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం..ఏపీ అసెంబ్లీ నుంచి ప్రత్యేక తీర్మానం కోరినట్లు తెలుస్తోంది.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే కొత్త రాజధానిని ఎంచుకోవాలి. 2014 జూన్ 2ను అపాయింటెడ్ డేగా నిర్ణయిస్తూ, రెండు రాష్ట్రాలకు పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే నిర్దేశిత పదేళ్ల కాలం పూర్తయింది. ఈలోపే ఏపీ ప్రభుత్వం కొత్త రాజధాని ఏర్పాటు చేసుకుంది. అయితే దానికి చట్టబద్ధత లేదని అపోహలున్నాయి. 2015 ఏప్రిల్ 23నే అప్పటి ప్రభుత్వం రాజధాని అమరావతి అంటూ జీవో 97ను జారీ చేసింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరిట హైడ్రామా నడిచింది. 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక..మళ్లీ రాజధాని పనులు స్పీడ్ అయ్యాయి.ఈ క్రమంలోనే రాజధాని రైతుల నుంచి ప్రధాన డిమాండ్ ఒకటి వినిపిస్తూ వస్తోంది. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే..ఫ్యూచర్‌కు ఢోకా ఉండదని వాళ్లు సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేశారు. భవిష్యత్‌లో ఎవరు అధికారంలో ఉన్నా..రాజధానిని మార్చడానికి వీల్లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే అమరావతిని రాజధానిగా గుర్తించే చట్టసవరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదింపజేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.మొన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలోనే ఏపీ రాజధాని బిల్లును ఆమోదిస్తారని ప్రచారం జరిగింది. కానీ అసెంబ్లీ తీర్మానం లేకుండా బిల్లును ఆమోదించలేమని కేంద్ర న్యాయశాఖ చెప్పడంతో..లాస్ట్ మినిట్‌లో పక్కన పెట్టినట్లుగా టాక్ నడుస్తోంది. 28న అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపిన తర్వాత..ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ భేటీలో బిల్లును ఆమోదించి అదే రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఆ తర్వాత రాష్ట్రపతి రాజముద్రతో గెజిట్ రిలీజ్ చేస్తారని అంటున్నారు.

# కొత్త నేతల కోసం పార్టీల ఎదురుచూపులు

**విజయవాడ, మార్చి 27, పెన్ పవర్:** ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు వైసీపీలో నాయకత్వాన్ని ప్రశంసించే వారు కొందరైతే, క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసే వారు మరో వర్గంగా కనిపిస్తున్నారు. అదే పరిస్థితి టీడీపీ లో కూడా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురించి, మంత్రి నారా లోకేష్ గురించి ఎక్కువగా పొగిడే నాయకులు ఒకవైపు ఉంటే, నిశ్శబ్దంగా పని చేసే వారు మరోవైపు ఉన్నారుఇటీవల చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందిస్తూ, మాటలకంటే పని చేసే వారినే పార్టీ గుర్తిస్తుందని స్పష్టం చేశారు. మీడియా ముందు విమర్శలు చేయడం, ప్రత్యర్థి పార్టీలపై దాడి చేయడం ద్వారా మైలేజ్ పొందే ప్రయత్నాలను ఆయన తప్పుపట్టారు. ఇదే సమయంలో వైసీపీ)లో ఇలాంటి మందలింపులు బయటకు రావడం లేదు అనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా ఇప్పుడు కీలకంగా మారింది. దాదాపు 50 శాతం వరకు నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారు 88 అసెంబ్లీ స్థానాలు, 12 పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఈ మార్పుల నేపథ్యంలో పార్టీలకు కొత్త నాయకుల అవసరం తప్పనిసరిగా మారింది.అయితే ఇక్కడే అసలు సమస్య కనిపిస్తోంది. బాగా చదువుకున్న నాయకులను ఎంపిక చేయాలని అనుకుంటే, అలాంటి వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మరోవైపు సాధారణ స్థాయి నాయకులు ఉన్నా, వారిలో సామర్థ్యం ఎంత అనే ప్రశ్న ముందుకు వస్తోంది. కేవలం పొగడ్తలు చెప్పే వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో జెండా మోస్తూ పని చేసే కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వాలనే ఆలోచన కూడా ఉంది. కానీ అక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చే సిఫారసులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కారణంగా సరైన వ్యక్తిని ఎంపిక చేయడం పార్టీలకు సవాల్‌గా మారింది. ప్రతి నియోజకవర్గంలో పరిస్థితులు ఒకేలా లేకపోవడం కూడా సమస్యను పెంచుతోంది.కొన్ని జిల్లాల్లో నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో సరైన నాయకత్వం కొరతగా ఉంది. ఈ అసమతుల్యత కారణంగా పార్టీలకు నిర్ణయాలు

తీసుకోవడం కష్టం అవుతోంది. భవిష్యత్తులో బలమైన నాయకత్వం అవసరం పెరుగుతుందని స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, రాజకీయ పార్టీలకు ప్రస్తుతం నాయకుల ఎంపిక ఒక కీలక పరీక్షగా మారింది. సరైన వ్యక్తులను గుర్తించి అవకాశాలు ఇవ్వడం ద్వారా మాత్రమే భవిష్యత్తులో విజయాన్ని సాధించగలవు. ఇంకా రెండు సంవత్సరాల సమయం ఉన్న నేపథ్యంలో, నాయకులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. అదే సమయంలో పార్టీలు కూడా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఇతర రాష్ట్రాలకు జనసేన

**విజయవాడ, మార్చి 27, పెన్ పవర్:** పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా, ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మాజీ ఎమ్మెల్యే పి.ఎస్. ప్రకాష్ వంటి నేతలు పార్టీలో చేరడం జనసేన జాతీయ విస్తరణ ప్రయత్నాలకు ప్రారంభం అనుకోవచ్చు. జనసేన పార్టీ ప్రస్థానంలో 2024 ఎన్నికలు ఒక మైలురాయిగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించిన తర్వాత, పవన్ కళ్యాణ్ ఇప్పుడు తన రాజకీయ దృష్టిని పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ . తమిళనాడు వైపు మళ్లిస్తున్నారు. బెంగళూరులోని చిక్‌పేట్ మాజీ ఎమ్మెల్యే పి.ఎస్. ప్రకాష్ పార్టీలో చేరడం ద్వారా కర్ణాటకలో ఉన్న తెలుగు జనాభా మరియు, పవన్ కళ్యాణ్ అభిమాన గణం మద్దతును ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఇది కేవలం ఒక చేరిక మాత్రమే కాదు, కర్ణాటక రాజకీయాల్లో జనసేన ముద్ర వేయడానికి వేసిన తొలి అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన త్రిశూల్ వ్యూహంలో పార్టీ విస్తరణ ఒక కీలకమైన భాగం. ఈ వ్యూహం ప్రకారం.. పార్టీ కేవలం ఒక వ్యక్తి చరిష్మాపై ఆధారపడకుండా, ఇతర రాష్ట్రాల్లో కూడా క్షేత్రస్థాయి నాయకత్వాన్ని నిర్మించడమే లక్ష్యం. కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, బెంగళూరు వంటి ప్రాంతాల్లో తెలుగు మాట్లాడే ప్రజలు అధికంగా ఉండటం జనసేనకు కలిసొచ్చే అంశం. గతంలోనే కర్ణాటక ఎన్నికల సమయంలో పవన్ నిర్వహించిన ప్రచారానికి వచ్చిన స్పందనను చూసి, అక్కడ సొంతంగా క్యాడర్‌ను నిర్మించుకుంటే భవిష్యత్తులో కింగ్ మేకర్‌గా ఎదిగే


అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారుకేవలం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో భాగస్వామిగా ఉండటమే కాకుండా, దక్షిణాది రాష్ట్రాల్లో ఒక బలమైన ప్రాంతీయ శక్తిగా ఎదగాలన్నది పవన్ దీర్ఘకాలిక లక్ష్యం. సనాతన ధర్మం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆయన చేస్తున్న ప్రసంగాలు ఇతర రాష్ట్రాల్లోని యువతను కూడా ఆకర్షిస్తున్నాయి. కర్ణాటకలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ చేరికతో అక్కడ జనసేన జెండా అధికారికంగా ఎగరడం ప్రారంభమయింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లేదా తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలోని కొన్ని స్థానాల్లో పోటీ చేయడం ద్వారా తన సత్తా చాటాలని జనసేనాని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కర్ణాటక తర్వాత పవన్ చూపు తెలంగాణ , తమిళనాడుపై ఉంది. తెలంగాణలో ఇప్పటికే జనసేనకు బలమైన అనుచరగణం ఉంది, అక్కడ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాలను కూడా ముమ్మరం చేశారు. పొరుగు రాష్ట్రాల్లోని నేతలు జనసేన సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలోకి రావడం అనేది పవన్ కళ్యాణ్ రాజకీయ పరిణతిని , పెరుగుతున్న ఆయన జాతీయ స్థాయి ఇమేజ్‌ను సూచిస్తోంది. ముఖ్యంగా బీజేపీతో ఉన్న మిత్రధర్మం . కేంద్రంలో ఆయనకు ఉన్న ప్రాముఖ్యత ఈ విస్తరణకు మరింత తోడ్పడుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో విస్తరణ అనేది అంత సులభమైన విషయం కాదు. అక్కడ ఇప్పటికే స్థిరపడిన ప్రాంతీయ పార్టీలను, జాతీయ పార్టీలను ఢీకొని నిలబడాలంటే కేవలం అభిమానం సరిపోదు, బలమైన ఆర్థిక వనరులు, క్షేత్రస్థాయి యంత్రాంగం అవసరం. పి.ఎస్. ప్రకాష్ వంటి సీనియర్ నేతల అనుభవం కర్ణాటకలో పార్టీ పునాదులు వేయడానికి ఉపయోగపడవచ్చు. పవన్ కళ్యాణ్ తన సినిమాలను పక్కన పెట్టి పూర్తిస్థాయిలో ఇతర రాష్ట్రాలపై దృష్టి సారిస్తేనే ఈ విస్తరణ కల సాకారమయ్యే అవకాశం ఉందని ఎక్కువ మంది నమ్మకం.

# స్టీల్ ప్లాంట్ క్రెడిట్ వార్

**విశాఖపట్టణం మార్చి 27, పెన్ పవర్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి రాజయ్యపేట లో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ చుట్టూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద క్రెడిట్ వార్ నడుస్తోంది. మార్చి 23, 2026న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, దీనిపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి టీడీపీ ఇచ్చిన కౌంటర్లు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయితాడేపల్లిలో అద్దంకి పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు పునాది పడింది తన హయాంలోనే అని స్పష్టం చేశారు. 2022లో దావోస్ పర్యటనలో తాను ఆదిత్య మిట్టల్‌తో చర్చలు జరిపానని, నక్కపల్లితో పాటు పలు ప్రాంతాలను వారికి చూపించామని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందే ఈ ప్లాంట్ ఖరారైందని, ఇప్పుడు చంద్రబాబు దీనిని తన ఖాతాలో వేసుకోవాలని చూడటం క్రెడిట్ చోరీ అని విమర్శించారు. జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. గతంలో జగన్ ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ ఒడిశాలో వస్తోంది.. బాబు మాత్రం ఏపీకి వస్తుందంటూ జనం చెవిలో పూలు పెడుతున్నారు అని అన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఒడిశాకు వెళ్తుందన్న ప్లాంట్ ఇప్పుడు ఏపీకి ఎలా వచ్చింది? మీ హయాంలో ఒప్పందం జరిగితే అప్పుడే ఎందుకు శంకుస్థాపన చేయలేదు? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు.సుమారు 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్లాంట్, విశాఖ స్టీల్ ప్లాంట్ కంటే పెద్దదని ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా,

పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. 2028 డిసెంబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అధికారులు వెల్లడించారు.ఒకవైపు వైఎస్సార్‌సీపీ మేము తెచ్చిన ప్రాజెక్టును బాబు వాడుకుంటున్నారు అని ప్రచారం చేస్తుంటే, మరోవైపు టీడీపీ జగన్ హయాంలో పరిశ్రమలు పారిపోయాయి.. కూటమి ప్రభుత్వం వల్లే పెట్టుబడులు వస్తున్నాయి అని కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ వార్ ప్రస్తుతం ఏపీ పాలిటిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.

# ఫ్యాన్ కింద ఉక్కపోతేనా



**కడప, మార్చి 27, పెన్ పవర్:** నియోజకవర్గాల పునర్విభజనతో వైసీపీ వైపు చూసే నేతల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయన్నఅంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న 175 నియోజకవర్గాల నుంచి 263కు, ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరగనున్నాయి. అంటే ప్రస్తుతమున్న నేతలకు తోడు అదనంగా మరో వంద మందికి పైగా నేతలకు వచ్చే ఎన్నికలలో టిక్కెట్లు దక్కనున్నాయి. అదే వైసీపీలో ఉంటే అడ్వాంటేజీ ఉంటుందన్న భావన నేతల్లో కలుగుతుంది. కూటమి కంటే ఫ్యాన్ పార్టీలో ఉంటేనే బెటర్ అని ఎక్కువ మంది సీట్లు ఆశిస్తున్న నేతలు భావిస్తున్నారు.కూటమిలో ఉండి టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తే సీటు వస్తుందో లేదో చివరకు వరకూ టెన్షన్ తప్పదు. ఎందుకంటే కూటమిలో టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీలుండటంతో ఎవరికి ఏ స్థానం కేటాయిస్తారన్నది ఎవరికీ అంతుచిక్కదు. చివరి నిమిషంలో కూటమిలో ఏ పార్టీ అయినా పట్టుబడితే తాము ఆశించిన సీటు చేజారి పోయే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ అనేక మంది సీనియర్ నేతలకు, ఆశావహులకు టిక్కెట్లు దక్కకపోవడానికి కూటమిలో పొత్తుల వల్లనేనని చాలామంది రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో కష్టపడ్డ తమకు గుర్తింపు రావాలంటే వైసీపీ అయితే బెటర్ అని భావించే అవకాశముంది.అదే వైసీపీలో చేరితే తాము గట్టిగా ప్రయత్నిస్తే టిక్కెట్ దక్కడం సులువవుతుందని ఎక్కువ మంది నేతలు నమ్ముతున్నారు. 263 శాసనసభ, 38 పార్లమెంటు నియోజకవర్గాల్లో పాత నేతలు కొందరు వెళ్లినా కొత్త వారికి అవకాశాలు వైసీపీలోనే దక్కుతాయని అప్ కమింగ్ లీడర్లు భావిస్తున్నారు. వైసీపీ సింగిల్ గా పోటీ చేస్తున్నందున పోటీ తక్కువగా ఉంటుందన్న ఆలోచనలో ఉన్నారు. అందుకే ఇప్పుడు రానున్న కాలంలో ఎక్కువ మంది నేతలు వైసీపీ వైపు వచ్చే అవకాశముందన్న అంచనాలు కూడా వినపడుతున్నాయి. టిక్కెట్ దక్కాలంటే ఫ్యాన్ కంటే పదిలం మరేది ఉండదన్న భావన ఎక్కువ మందిలో కలుగుతుంది. మరి రానున్న కాలంలో వైసీపీలో చేరికలు ఏ మాత్రం ఉంటాయన్నది చూడాలి.

# అడగడుగునా లోపాలే...

**ఒంగోలు, మార్చి 27, పెన్ పవర్:** మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదానికి బస్సు కండిషన్ కూడా ఒక కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.దారి మధ్యలో ప్రమాదానికి గురైన బస్సు రిపేరుకు గురయిన విషయాన్నిబాధితులు చెబుతున్నారు. యర్రగొండపాలెం సమీపంలో బస్సు రిపేర్ కావడంతో దానిని అరగంట సేపు మరమ్మతులు చేసి తిరిగి బయలుదేరాశారని ప్రయాణికులు చెబుతున్నారు. ఈరోజు తెల్లవారు జామున 4.20 గంటలకు టోల్ గేట్ బస్సు దాటింది. టోల్ గేట్ దాటిన యాభై నిమిషాలకు ప్రమాదం జరిగిందని, 5.20 గంటలకు బస్సు ప్రమాదానికి గురయిందని బాధితులు తెలిపారు.మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇప్పటి వరకు 13 మంది మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదం నేపథ్యంలో కీలక విషయం వెల్లడైంది. బస్సు కండీషన్‌పై అందులోని ప్రయాణికులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేశారు. కండీషన్ సరిగా లేదని డ్రైవర్‌తో చెప్పారు. దీంతో బస్సు సిబ్బంది యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేశారు. అనంతరం బయల్దేరిన కొంత సమయం తర్వాత మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ఈ ఘోరం జరిగిపోయింది. బస్సు డ్రైవర్‌ను అధికారులు విచారిస్తే స్టీరింగ్ స్ట్రక్ అయిందని చెప్పినట్లు తెలిసింది.స్టీరింగ్ కూడా స్ట్రక్ అయిందని చెబుతున్నారు. అలాగే బస్సు కండిషన్ కూడా బాగా లేదని తాము గమనించినట్లు ప్రయాణికులు అంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షణాల్లో మంటలు అంటుకోవడంతో ఎవరూ తప్పించుకోలేకపోయారని, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం నలభై ఒక్క మంది ప్రయాణికులున్నారని చెబుతున్నారు. అందులో పదమూడు మంది చనిపోగా, 26 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా ఉండటంతో నెల్లూరు నుంచి ఫోరెన్సిక్ నిపుణులను రప్పిస్తున్నారు. ఆరోగ్యం విషమంగా ఉన్న వారిని ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

# మాటలు సరే... చేతలు ఎక్కడా

**కడప, మార్చి 27, పెన్ పవర్:** జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 2024 ఎన్నికల ఓటమి ఒక పెద్ద కుదుపు. అయితే, ఓటమి తర్వాత ఆయన కేడర్‌లో ధైర్యం నింపడానికి, ప్రజల్లోకి వస్తానని పదేపదే చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రేపు మాపు అంటూ కాలం గడుపుతున్న తీరుపై సొంత పార్టీలోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు వైఎస్ జగన్ చేసిన ప్రకటనలను గమనిస్తే, ఆయన యాక్షన్ ప్లాన్ కేవలం ప్రకటనలకే పరిమితమైందని స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి పార్టీ నేతలతో మాట్లాడిన జగన్, "ప్రజల పక్షాన పోరాడతాం, త్వరలోనే జిల్లాల పర్యటనలు చేపడతాను" అని ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఆయన పర్యటనలు కేవలం బెంగళూరు ప్యాలెస్‌కు, తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకే పరిమితమయ్యాయి. అక్టోబర్ 2024 నుంచి జిల్లాల బాట పడతానని కేడర్ ను కలుస్తానని చెప్పారు. కానీ ఆ దసరా కూడా దాటిపోయింది.దసరా అనంతరం మీడియా ముందుకొచ్చిన జగన్, సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనలు చేస్తానన్నారు. నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతానన్నారు. వారంలో రెండ్రోజులు పాటు జిల్లాల్లోనే ఉంటానన్నారు. అది కూడా దాటిపోయింది. 2025 ఉగాది తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని, బస్సు యాత్ర చేసే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ అది కూడా దాటిపోయింది. ఇప్పటికే ఏడాది అయింది. కానీ ఆయన జనంలోకి మాత్రం రాలేదు.ఇప్పుడేమో వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ చెప్తున్నారు. అంతేకాదు.. పాదయాత్రలో చంద్రబాబుకు సినిమా చూపిస్తానంటున్నారు. ఇలాంటి ప్రకటనలు కేడర్ లో తాత్కాలిక ఉత్సాహం నింపుతున్నాయి కానీ, ఇలాంటి వాటి వల్ల పార్టీకి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. గతంలో ఆయన ఇచ్చిన స్టేట్ మెంట్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దీంతో ఇప్పుడు పాదయాత్ర కూడా స్టేట్ మెంట్ కు పరిమితమైపోయే అవకాశం ఉందనే ఊహాగానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇదిగో వచ్చేస్తున్నా, అదిగో వచ్చేస్తున్నా అని చెప్పిన మరుసటి రోజే జగన్ బెంగళూరు వెళ్లిపోతున్నారు. దీంతో కేడర్ కి ఇలాంటి స్టెంట్ మెంట్స్ వినడం అలవాటైపోయింది. వాళ్లు కూడా పెద్దగా పట్టించుకోవడం మానేస్తున్నారు. ఈ సారైనా చెప్పిన మాట మీద నిలబడితే బాగుంటుందని కేడర్ కోరుకుంటోంది. జగనన్న మాట తప్పడు, మడమ తిప్పడు అని కేడర్ చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆయన చేతలు స్టేట్ మెంట్స్ కే పరిమితం అవుతుండడంతో కేడర్ లోనే అనుమానాలు మొదలవుతున్నాయి.

# తల రాతను మార్చలేం కానీ.. తలకు హెల్మెట్ పెట్టి చావును తప్పించవచ్చు

## రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఎస్సై నరేష్.

**జొన్నాడ (ఆలమూరు): పెన్ పవర్:** హెల్మెట్ భారం కాదు.. మన ప్రాణానికి రక్షణ కవచమని మన కోసం ఇంట్లో ఎదురుచూసే ప్రాణాలున్నాయని, హెల్మెట్ ధరించడం మర్చిపోకూడదని, తల రాతను మార్చలేం కానీ... తలకు హెల్మెట్ పెట్టి చావును తప్పించుకోవచ్చునని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ నుండి మడికి వరకు 216ఏ జాతీయ రహదారిపై వెళ్ళు ద్విచక్ర వాహనదారులకు ఆలమూరు ఎస్సై జి నరేష్ తో కలిసి హెల్మెట్ దారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి మీ ప్రాణాలు కాపాడుకోవాలని, రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా హెల్మెట్లు ధరించాలని అన్నారు. స్టైల్ కోసం హెల్మెట్ వదలద్దని, మన లైఫ్ కోసం హెల్మెట్ మరువద్దని, బైక్ రేస్ కాదు.. హెల్మెట్ లేకపోతే నీజీవితం లాస్ అని మీ తల మీ కుటుంబానికి ఆస్తిని దానిని జాగ్రత్తగా చూసుకోండని హెచ్చరించారు. అనంతరం హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రధాన ఉపయోగాలను వివరిస్తూ ప్రాణాపాయం నుండి రక్షణ రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాలలో 80% పైగా తలకు తగిలిన గాయాల వల్లే జరుగుతాయని, హెల్మెట్ ధరించడం వల్ల మెదడుకు గాయం అయ్యే ప్రమాదం 70% నుండి 80% వరకు తగ్గుతుందని, కంటి రక్షణ హెల్మెట్ ముందు ఉండే గ్లాస్ ప్రయాణ సమయంలో గాలి, ధూళి, పురుగులు, ఇసుక రేణువులు కంట్లో పడకుండా కాపాడుతుందని, దీనివల్ల దృష్టి మళ్ల కుండా ప్రశాంతంగా వాహనం నడపవచ్చునని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల జరిమానాలు కట్టాల్సిన అవసరం ఉండదుని, ఇది మీ ఆర్థిక పొదుపుతో పాటు బాధ్యతా యుతమైన పౌరుడిగా గుర్తింపునిస్తుందని అన్నారు. అనంతరం హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఇరాన్‌పై ముమ్మర దాడులకు ఇజ్రాయిల్ నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో శాంతి చర్చలంటూ అమెరికా ఒకవైపు డ్రామాలు ఆడుతుండగా, మరోవైపు మాత్రం ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులతో విరుచుకుపడుతోంది. అధ్యక్షులు నెతన్యాహు దాడులను మరింత తీవ్రతరం చేయడంపైనే దృష్టి పెట్టారు. పోరును ఆపేందుకు ఇజ్రాయిల్ ఏ మాత్రం సుముఖంగా లేదు. అందులో భాగంగా అధిక ప్రాధాన్యత కలిగిన లక్ష్యాలను ఎంచుకుంటుంది. సైనిక చర్యలను ముమ్మరం చేయాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్, అమెరికా మధ్య అర్థవంతమైన శాంతి చర్చలు జరిగేందుకు అన్ని పక్షాలు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని చైనా విదేశాంగ శాఖ కోరింది. ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్న సంప్రదింపులపై విదేశాంగ శాఖ ప్రతినిధిని విలేకరులు ప్రశ్నించగా 'శాంతి చర్చలను ముందుకు తీసుకుపోవడంపై దృష్టి సారించాలి. దానికి ప్రాధాన్యత ఇవ్వాలి. యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలి' అని సూచించారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు ధరలు పెరుగుతుండడంతో అమెరికా ప్రభుత్వం తపాలా సేవలపై ఎనిమిది శాతం సర్‌ఛార్జ్ విధించింది. దీంతో అమెరికన్లు తమ ప్యాకేజీలపై అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. గురువారం నుంచి అమలులోకి వచ్చిన ఈ సర్‌ఛార్జ్ వచ్చే సంవత్సరం జనవరి 17వ తేదీ వరకూ అమలులో ఉంటుంది. ప్రయారిటీ మెయిల్ ఎక్స్‌ప్రెస్, ప్రయారిటీ మెయిల్, యూఎస్‌పీఎస్ గ్రౌండ్ అడ్వాంటేజ్ అండ్ పార్సిల్ సెలక్ట్ కింద పంపే ప్యాకేజీలు మరింత భారం కాబోతున్నాయి. వినియోగదారులపై ఇలాంటి ఫీజును విధించడం 55 సంవత్సరాల అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి. సర్‌ఛార్జ్ విధించాలన్న నిర్ణయాన్ని అమెరికా పోస్టల్ సర్వీస్ సమర్థించుకుంది. రవాణా ఛార్జీలు పెరగడమే దీనికి కారణమని తెలిపింది.

## 'హోర్ముజ్'ను తెరిచిన ఇరాన్ భారత్‌తో సహా మిత్ర దేశాలకు మాత్రమే

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడికి ఇంట్లోనే జైలు శిక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారోకు గృహ నిర్బంధం మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన కేసులో 27 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయనను ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇంటి వద్దనే శిక్ష అనుభవించేందుకు అనుమతించారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ అలెగ్జాండర్ మోరేస్ ఉత్తర్వులు జారీ చేశారు. 90 రోజుల తర్వాత ఈ నిర్ణయాన్ని సమీక్షిస్తామని కోర్టు స్పష్టం చేసింది. కోర్టు విధించిన కఠిన నిబంధనల ప్రకారం, బోల్సొనారో మొబైల్ ఫోన్లను ఉపయోగించకూడదు, మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకూడదు. ఆయన కాలి వద్ద ఎలక్ట్రానిక్ మానిటర్ అమర్చాలని ఆదేశించారు. ఇంటి ముందు ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని, పోలీసుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే వైద్యులు, కుటుంబ సభ్యులు తప్ప ఇతరులను కలవడానికి అనుమతి లేదు. ఇటీవల న్యుమోనియా మరియు కిడ్నీ సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోల్సొనారో ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. నవంబర్‌లో ఆయన దోషిగా తేలినప్పటి నుండి గృహ నిర్బంధం కోరుతూ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఆయనను శుక్రవారం డిశ్చార్జ్ చేసి గృహ నిర్బంధంలోకి తరలించే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ పరిణామం బ్రెజిల్ రాజకీయాల్లో కీలక చర్చకు దారితీసింది.

## నేపాల్ నూతన ప్రధానిగా బాలెంద్ర షా ప్రమాణ స్వీకారం



**హైదరాబాద్ పెన్ పవర్:** నేపాల్‌లో ఆర్ఎస్పీ పార్టీ ఘన విజయం సాధించడంతో, ఆ పార్టీకి చెందిన బాలెంద్ర షా(35) దేశ నూతన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అతి పిన్న వయస్కుడైన ప్రధానిగా, మధేశ్ ప్రాంతం నుంచి ఈ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా బాలెన్ చరిత్ర సృష్టించారు. ఒకప్పుడు ర్యాపర్ గా యువతను ఆకట్టుకున్న బాలెన్, జెన్-జీ తిరుగుబాటుతో సామాజిక, రాజకీయ చైతన్యం నింపి, అనుభవజ్ఞుడైన కె.పి.శర్మ ఓలిని ఓడించి నాయకుడిగా ఎదిగారు. ఆర్ఎస్పీ నేపాల్ పార్లమెంట్‌లో 182 స్థానాలు కైవసం చేసుకుని పూర్తి మెజారిటీ సాధించింది.

## అమెరికా సైన్యానికి ప్రాణభయం

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఓవైపు అమెరికా, ఇజ్రాయిల్ కలిపి దాడులు చేస్తుండగా, అటు ఇరాన్ సైతం క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ దాడులతో పశ్చిమాసియాలోని అమెరికా సైనిక కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. వారిని ప్రాణభయం వెంటాడుతోంది. ముఖ్యంగా ఇరాన్ నిరంతరాయంగా జరుపుతున్న క్షిపణి, డ్రోన్ దాడుల కారణంగా అనేక అమెరికా సైనిక స్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయని 'ది న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. యూఎస్-ఇజ్రాయిల్ సంయుక్త దాడులకు ప్రతీకారంగా పశ్చిమాసియాలోని సుమారు 13 అమెరికా సైనిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కారణంగా వేలాది మంది అమెరికా సైనికులు తమ సంప్రదాయ స్థావరాలను వదిలిపెట్టి ఈ ప్రాంతంలోని హోటళ్లు, కార్యాలయాలకు తరలివెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ఇరాన్ దాడులతో ముఖ్యంగా కువైట్‌లో తీవ్రమైన నష్టం వాటిల్లిందని 'ది న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. అక్కడ కీలకమైన స్థావరాలపై దాడులు జరిగాయని తెలిపింది. పోర్ట్ షోయబాలో ఒక క్షిపణి ఆర్మీ టాక్టికల్ ఆపరేషన్స్ సెంటర్‌ను ధ్వంసం చేయడంతో ఆరుగురు అమెరికా సైనికులు మరణించినట్టు చెప్పింది. అలీ అల్ సలేం ఎయిర్ బేస్, క్యాంప్ బ్యూరింగ్‌పై కూడా ఇరాన్ దాడులు చేయడంతో విమాన మౌలిక సదుపాయాలు, ఇంధన డిపోలు, నిర్వహణ సౌకర్యాలు దెబ్బతిన్నట్టు వివరించింది. అటు ఖతార్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాంతంలో అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంగా భావిస్తున్న అల్ ఉదైద్ ఎయిర్ బేస్‌పైనా దాడి జరిగింది. ఫలితంగా దాని ముందస్తు హెచ్చరిక రాడార్ వ్యవస్థలకు నష్టం వాటిల్లిందని పేర్కొంది.

# రాహుల్ గాంధీ పాఠాలు నేర్చుకోవడం లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాహుల్ గాంధీ జాతీయ రాజకీయ నాయకుడైనా అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. గురువారం నాడు కేరళలోని కొత్తమంగళంలోని పినరయి విజయన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ ఒక ప్రాంతీయ నాయకుడికి ఉండే అవగాహన కూడా లేదని, ఆయన ఏ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడని అన్నారు. కాంగ్రెస్ లోని ఒక కీలక వ్యక్తిలో ఇంతటి పతనం ఎలా సాధ్యం? ఇదంతా చూస్తుంటే రాహుల్ గాంధీ, దేశంలోని కాంగ్రెస్ పార్టీ బిజెపికి బి-టీమ్ అని స్పష్టమవుతోందని అన్నారు. రాహుల్ తీసుకుంటున్న వైఖరి ఈ పరిస్థితికి అనుగుణంగానే ఉందని విమర్శించారు. మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ ను అరెస్టు చేయాలని ఢిల్లీలోని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కోరారని పినరయి విజయన్ గుర్తు చేశారు. అయితే ఆ తరువాత కేజ్రీవాల్ నిర్దోషిగా విడుదల కావడం, రాహుల్‌తో సహా బిజెపి, కాంగ్రెస్ లకు అది గట్టి దెబ్బ అని అన్నారు. ఢిల్లీలో బిజెపిని ఓడించేందుకు ఆప్‌తో చేతులు కలపకుండా కాంగ్రెస్ కేజ్రీవాల్ పార్టీని వ్యతిరేకించడం, తద్వారా అక్కడ కాషాయ పార్టీ విజయం సాధించడానికి అవకాశం లభించిందని తెలిపారు. అదే విధంగా హర్యానా, బీహార్ లోని బిజెపికి వ్యతిరేకంగా కూటమిని ముందుకు తీసుకెళ్లడంలో కాంగ్రెస్ విఫలం కావడం, ఆ రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాషాయ పార్టీ విజయానికి దారి తీసిందన్నారు. ఇదంతా కాంగ్రెస్ బిజెపి గెలవడానికి సహాయం చేస్తూ, దానికి భాగస్వామిగా వ్యవహరిస్తోందని స్పష్టమవుతోందన్నారు. ఎల్డిఎఫ్ ను ఓడించడానికి కేరళలో దశాబ్దాలుగా బిజెపితో పొత్తులో ఉన్న పార్టీయే కాంగ్రెస్ అని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు, ఈఎంఎస్ నంబూద్రిపాద్ కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ ఆర్ఎస్ఎస్‌తో, ఆ తరువాత జన సంఘ్? పార్టీతో, ఇప్పుడు బిజెపితో పొత్తు పెట్టుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్, బిజెపి రెంటింటికి ఒకే విధమైన ఆలోచనా విధానం ఉందని ధ్వజమెత్తారు. అందువల్ల జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదనే భయం పట్టుకుందని అందుకే, సిపిఎం, బిజెపి మధ్య పొత్తు ఉందని కాంగ్రెస్ నేత ఆరోపణ కేవలం ముందస్తు సాకు మాత్రమేనని అన్నారు.

# రాజకీయ నిధుల్లో బిజెపిదే అగ్రస్థానం !

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయస్థాయిలో ఇతర రాజకీయ పార్టీల కంటే భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి అధిక మొత్తంలో విరాళాలు వచ్చాయి. 2024-25 సంవత్సరంలో ఇతర పార్టీలతో పోలిస్తే పది రెట్లు అధికంగా ఈ విరాళాలు అందుకున్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక నివేదికను విడుదల చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25లో జాతీయ పార్టీలకు అందిన విరాళాలు 161శాతం పెరిగాయి. ఇందులో పాలక బిజెపిదే అగ్ర స్థానంగా వుంది. జాతీయ స్థాయిలో ఇతర రాజకీయ పార్టీలన్నీ అందుకున్న మొత్తాల కంటే పది రెట్లు పైనే బిజెపికి విరాళాలు వచ్చాయని ఎడిఆర్ నివేదిక వివరించింది. జాతీయ పార్టీలు ప్రకటించిన రూ.20వేల పైచిలుకు విరాళాలు, 11,343 మంది నుండి రూ.6,648.563 కోట్లు మేరకు అందాయని ఆ నివేదిక పేర్కొంది. ఇందులో కేవలం బిజెపికే 5,522 విరాళాల ద్వారా రూ.6,074.015 కోట్లు వచ్చాయి.

ఆ తర్వాత కాంగ్రెస్‌కు 2,501 విరాళాల ద్వారా రూ.517.394 కోట్లు అందాయి. కాంగ్రెస్, ఆప్, సిపిఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిఇపి)లు ఇదే కాలంలో అందుకున్న మొత్తం విరాళాల కన్నా బిజెపి విరాళాలు పదిరెట్లు దాటిపోయాయని నివేదిక పేర్కొంది. కాగా తమకు రూ.20వేల పైచిలుకు విరాళాలేవీ రాలేదని బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) వెల్లడించింది. గత 19ఏళ్ళ నుండి ఈపార్టీ ఇదే తీరున ప్రకటిస్తూ వస్తోంది. 2023-24తో పోలిస్తే 2024-25లో జాతీయ పార్టీలకు వచ్చిన మొత్తం విరాళాలు రూ.4,104.265 కోట్లు మేరా పెరిగాయి. కేవలం బిజెపి వసూళ్ళే రూ.2,243.947 కోట్ల నుండి 171 శాతం మేరా పెరిగాయి. అదే సమయంలో కాంగ్రెస్‌వి 84శాతం మేరా పెరిగాయి. రూ.281.48కోట్ల


నుండి రూ.517.394 కోట్లకు పెరిగాయి. ఇక ఇతర పార్టీల్లో ఆప్‌కు రూ.27.044కోట్లు రాగా, 244శాతం పెరుగుదల నమోదైంది. ఎన్‌పిఇపికి రూ.1.943కోట్లు రాగా, 1313శాతం మేరా పెరుగుదల నమోదైందని నివేదిక పేర్కొంది. రాజకీయ నిధుల్లో కార్పొరేట్ విరాళాలదే ఆధిపత్యం. 3,244 విరాళాల ద్వారా అందిన మొత్తం విరాళాల్లో 6,128.787 కోట్లు అంటే 92.18శాతం వాటా వీటిదే. ఇక వ్యక్తిగతంగా దాతలు అంటే 7900 మంది అందించిన విరాళాలు రూ.505.66కోట్లుగా వున్నాయి.

# 25.86% తగ్గిన ఎన్ఆర్ఐ డిపాజిట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వేగంగా తరలిపోతుండగా.. మరోవైపు ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) డిపాజిట్లు భారీగా క్షీణించాయి. ఇటీవల కాలంలో ఎన్ఆర్ఐలు చేసే డిపాజిట్లలో భారీ తగ్గుదల నమోదైందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణాంకాలు వెల్లడించాయి. కేంద్ర బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం.. 2025 ఏప్రిల్ నుండి 2026 జనవరి మధ్య కాలంలో ఎన్ఆర్ఐ డిపాజిట్ పథకాల్లోకి వచ్చిన పెట్టుబడులు 25.86 శాతం క్షీణించి 10.61 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఈ పెట్టుబడులు 14.31 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. జనవరి 2026 నాటికి ఎన్ఆర్ఐ మొత్తం బకాయి (అవుట్‌స్టాండింగ్) ఉన్న డిపాజిట్లు 165.78 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇవి అంతకుముందు నెల డిసెంబర్ 2025లో ఉన్న 169.27 బిలియన్ డాలర్ల కంటే తక్కువ. ముఖ్యంగా విదేశీ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సిఎన్ఆర్-బి) డిపాజిట్ల ప్రవాహంలో భారీ వ్యత్యాసం కనిపించింది. ఈ డిపాజిట్లు గత ఏడాది ఏప్రిల్ ? జనవరి కాలంలో 7.02 బిలియన్ డాలర్లుగా ఉండగా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఏకంగా 0.94 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ప్రస్తుతం ఎన్ఆర్ఐ డిపాజిట్ పథకాల్లో ఎఫ్‌సిఎన్ఆర్, ఎన్ఆర్ఇ, ఎన్ఆర్ఓ డిపాజిట్లు ప్రధాన భాగాలుగా ఉన్నాయి.

## డ్రైవింగ్ స్కూళ్ల ద్వారా కోటి ఉద్యోగాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రానున్న అయిదేళ్లలో కోటి ఉద్యోగాల కల్పనకు ప్రైవేటు రంగంతో కలిసి డ్రైవింగ్ స్కూళ్లను ప్రభుత్వం ప్రారంభిస్తుందనీ, వీటిని సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన 120 జిల్లాలు, 500 బ్లాకులలో ఏర్పాటు చేస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. దేశ రాజధానిలో గురువారం జరిగిన 'సడక్ సురక్ష అభియాన్' కార్యక్రమంలో సినీ నటుడు ఆమిర్ ఖాన్‌తో ఆయన సంభాషించారు. దేశంలో 22 లక్షల మంది డ్రైవర్లకు కొరత ఉందని, ప్రభుత్వం ఇప్పటికే 200 డ్రైవింగ్ స్కూళ్లను తెరిచిందని తెలిపారు. "ప్రస్తుతం దేశంలో ఏటా ఐదు లక్షలకు పైగా ప్రమాదాలు, వాటిలో 1.8 లక్షల మరణాలు నమోదవుతున్నాయి. రహదారుల డిజైన్, ఇంజనీరింగ్ లోపాలే ప్రథమ కారణం. రెండో కారణం- ఆటోమొబైల్ ఇంజనీరింగ్. మూడో కారణం- చట్టాల అమలులో లోపాలు. నాలుగో కారణం- మానవ ప్రవర్తనే. దేశంలో చట్టం పట్ల భయం, గౌరవం లేదు" అని గడ్కరీ చెప్పారు. చట్టాల రూపకల్పన, సౌకర్యాలు కల్పించడం వంటివి ప్రభుత్వం చేస్తుందని, ప్రజలు వీటిని పాటించకపోతే మాత్రం సమస్య పరిష్కారం కాదని ఆమిర్ ఖాన్ అన్నారు. పోలీసులున్నారనే భయంతోనే ప్రజలు శిరస్త్రాణం ధరిస్తున్నారని, పోలీసులు లేకున్నా దాన్ని ధరించడం ప్రాణాలను కాపాడుతుందని అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

## గంటసేపు ఆకాశంలో చక్కర్లు ఎట్టకేలకు క్షేమంగా దిగిన మమతా బెనర్జీ విమానం



**హైదరాబాద్ పెన్ పవర్:** తుపాను కారణంగా గంటసేపు ఆకాశంలో చక్కర్లు కొట్టిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమానం ఎట్టకేలకు కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్షేమంగా దిగింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో ఎన్నికల ప్రచారం ముగించుకుని గురువారం సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో మమతా బెనర్జీ.. కోల్‌కతాకు బయలుదేరారు. అది 4 గంటల సమయంలో దిగాల్సి ఉంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో అప్పటికే కోల్‌కతా విమానాశ్రయంలో విమానాలకు అంతరాయం కలుగుతోంది. ఆకస్మికంగా ఉరుములు, భారీ వర్షం, బలమైన గాలులు రావడంతో విమానాలు దిగడానికి ఇబ్బంది తలెత్తింది. 20 నిమిషాలపాటు విమానాల ల్యాండింగ్‌కు అనుమతివ్వలేదు. దీంతో గంటపాటు మమతా బెనర్జీ విమానం గాలిలో చక్కర్లు కొట్టింది. చివరకు 5.19 గంటలకు క్షేమంగా దిగింది.

## ఎన్నికల ప్రయోజనం కోసమే ఆ ప్రకటనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై, సిపిఎం లౌకికవాద విశ్వసనీయతపై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల రెచ్చగొట్టే ప్రకటనలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. వారు, ఇటువంటి కట్టుకథలను వార్తలను ప్రచారం చేయడం ద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో చవకబారు ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. బిజెపికి బదులుగా సిపిఎంను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతలు, మతోన్మాద, నిరంకుశవాద శక్తులపై పోరాటం సాగిస్తామంటూ ఇచ్చిన హామీలను ఉల్లంఘిస్తున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. కేరళ ప్రజలు ఈ కుట్రపూరిత ఎజెండాను గ్రహిస్తారని పేర్కొంది. ఒక రాష్ట్రం తర్వాత మరొక రాష్ట్రంలో వరుసగా తమ నేతలు ఎందుకు పార్టీని వీడి బిజెపిలో చేరుతున్నారో కాంగ్రెస్ నేతలు తప్పనిసరిగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సి వుందని హితవు చెప్పింది. ప్రస్తుత అస్సాం ముఖ్యమంత్రి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకమైన పదవులు నిర్వహించారన్నది అందరికీ తెలిసిన వాస్తవమే. త్రిపురలో, 2018లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించేందుకు గానూ మొత్తంగా కాంగ్రెస్ నాయకత్వం బిజెపిలో చేరింది. కేంద్ర ప్రభుత్వంలోని పలువురు మంత్రులు, బిజెపికి చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు గతంలో కాంగ్రెస్‌లో ప్రముఖ నేతలే బిజెపికి పోషక సంస్థగా కాంగ్రెస్ మారిపోయిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

పదేళ్ళ ప్రస్తుత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ హయాంలో, కేరళలో మత ఘర్షణలు జరిగిన సంఘటన ఒక్కటీ లేదు. మరోవైపు రాష్ట్రంలోని మరద్‌లో జరిగిన అత్యంత అధ్వాన్నమైన మతోన్మాద ఘర్షణలు యుడిఎఫ్ ప్రభుత్వ హయాంలోనే చోటు చేసుకున్నాయి. ఈ ఎన్నికల్లో కూడా, మైనారిటీ ఛాందసవాద శక్తులతో కాంగ్రెస్ జత కడుతోంది. ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలతో సహా కేరళలో వివిధ ఎన్నికల్లో కాంగ్రెస్-లీగ్-బిజెపి బంధం బట్టబయలయింది.

# ముడి సరుకుల కొరత
# రసాయన, ఉక్కు, వస్త్ర రంగాలు కుదేలు

అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత పారిశ్రామిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాలు స్టీల్, అల్యూమినియం, టెక్స్‌టైల్, రసాయన రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ముడి సరుకుల రవాణా నిలిచిపోవడం, ఎల్‌పిజి, పిఎన్‌జి వంటి గ్యాస్ కొరత ఏర్పడటంతో ఉత్పత్తి వ్యయం పెరగడమే కాకుండా.. కొన్ని పరిశ్రమలు తమ ఉత్పత్తి గంటలను తగ్గించుకుంటున్నాయి. యూరప్ నుండి రావాల్సిన ఫ్లాక్స్ వంటి ముడిసరుకు నిలిచిపోవడంతో ప్రముఖ టెక్స్‌టైల్ కంపెనీలు కేవలం నెల రోజులకు సరిపడా నిల్వలతోనే కాలం వెళ్లదీస్తున్నాయి. ''బెల్జియం, ఫ్రాన్స్ నుండి రావాల్సిన ముడిసరుకు ఫ్లాక్స్ కంటైనర్లు గత 20 రోజులుగా జెబల్ అలీ పోర్టులో చిక్కుకుపోయాయి. మా వద్ద కేవలం 30 రోజులకు సరిపడా స్టాక్ మాత్రమే ఉంది. మరో 10 రోజుల్లో సరఫరా పునరుద్ధరించకపోతే ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది'' అని ఒక ప్రముఖ టెక్స్‌టైల్ బ్రాండ్ ఎగ్జిక్యూటివ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనిశ్చితి వల్ల కంపెనీలు తమ ఉత్పత్తి గంటలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ యుద్ధం వ్యవసాయ రంగాన్ని ఒత్తిడికి గురి చేయనుందని రసాయన రంగ విశ్లేషకులు అజరు జోషి హెచ్చరించారు. ప్రపంచ సల్ఫర్ సరఫరాలో 35 శాతం పశ్చిమాసియా నుంచే వస్తుందన్నారు.. 'ఈ సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల సల్ఫ్యూరిక్ యాసిడ్ ధరలు ఏడాది కాలంలో 80 శాతం పెరిగాయి. ఇది నేరుగా డిఎపి వంటి ఎరువుల ధరలపై ప్రభావం చూపుతుంది. ఇది కేవలం వస్తువుల ధరల సమస్య మాత్రమే కాదు. దేశ ఆహార భద్రతకే ముప్పు. ఖరీఫ్ సీజన్ ముందు ఈ ధరల పెరుగుదల రైతులకు పెను సవాలుగా



మారనుంది.' అని జోషి పేర్కొన్నారు. ఇంధన కొరత కూడా పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీస్తోంది. 'తీవ్రమైన ఎల్‌పిజి, పిఎన్‌జి కొరత వల్ల పరిశ్రమలు మూతపడే దిశగా వెళ్తున్నాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే ఎంఎస్ఎంఇ రంగం కుప్పకూలే ప్రమాదం ఉంది'' అని అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (అలెమా) ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ముడి సరుకు కొరతతో గాజు సీసాల ధరలు 20 శాతం, కార్టన్ బాక్సుల ధరలు 100 శాతం పెరగడంతో మద్యం తయారీ పరిశ్రమ

కూడా భారంగా మారిందని బ్రూవర్స్ అసోసియేషన్ (బిఎఐ) తెలిపింది. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో సామాన్య వినియోగదారులపై ధరల భారం తప్పదని స్పష్టమవుతోందని పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఇరాన్ గ్యాస్ కొనుగోలు చేసిన ఐఓసీ




పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరుగుతున్నందున, గతంలో ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలోనే మన ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత ఇరాన్ నుంచి గ్యాస్ (ఎల్‌పీజీ)ని కొనుగోలు చేసింది. దాదాపు 43,000 టన్నుల గ్యాస్‌ను బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌తో ఐఓసీ పంచుకోనుంది. ఇది మన దేశంలో సగం రోజు డిమాండ్‌కు మాత్రమే సరిపోతుంది. సరఫరా అంతరాయాల నేపథ్యంలో, దేశీయంగా ఇళ్లలో వినియోగించే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ కాలవ్యవధిని కంపెనీలు పెంచాయి. వాణిజ్య సిలిండర్లు 50% మాత్రమే సరఫరా అవుతున్నాయి. అందువల్ల వీలైనన్ని దేశాల నుంచి గ్యాస్ దిగుమతి చేసుకునేందుకు మనదేశం ప్రయత్నిస్తోంది. డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ప్రకారం.. ఐఓసీ చివరిసారిగా 2018 జూన్‌లో ఇరాన్ నుంచి ఎల్‌పీజీని కొనుగోలు చేసింది. ప్రస్తుతం కొనుగోలు చేసిన వాటిలో 43,000 టన్నుల బ్యూటెన్, ప్రొపేన్ ఉన్నాయి. సీ బర్డ్ అనే ఎల్‌పీజీ వాహక నౌక ఇరాన్ నుంచి ఈ సరకును తీసుకుని మంగళూరు పోర్టుకు చేరుకోనుంది. గ్రీన్ ఆశా, గ్రీన్ శాన్వి నౌకల సురక్షిత ప్రయాణం కోసం చర్చలు జరుగుతున్నాయి. మన దేశ ఎల్‌పీజీ అవసరాల్లో మూడింట రెండొంతులు దిగుమతులే తీరుస్తున్నాయి. ఇందులో 90% పశ్చిమాసియా, హర్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. యుద్ధం వల్ల ఈ మార్గంలో ఏర్పడుతున్న అవాంతరాల వల్లే దేశీయంగా కొరత ఏర్పడింది.

# ఇన్ఫోసిస్ చేతికి ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ, స్ట్రాటస్

అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే హెల్త్‌కేర్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంపెనీ ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ, ఇన్సూరెన్స్ కన్సల్టింగ్ టెక్నాలజీ కంపెనీ స్ట్రాటస్‌లను సుమారు రూ.5,260 కోట్లతో కొనుగోలు చేయనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీని 465 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,370 కోట్ల)తో ఇన్ఫోసిస్ కొనుగోలు చేయనుంది. ఇందులో ముందస్తు చెల్లింపులు, ఎర్నౌట్‌లు కలిపి ఉంటాయి. యాజమాన్య ప్రోత్సాహకాలు, నిలుపుదల బోనస్‌లు మినహాయిస్తారు. షరతులు పూర్తయిన తర్వాత, ఈ కొనుగోలు 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పూర్తికావచ్చని అంచనా. ప్రోపర్టీ అండ్ క్యాజువాల్టీ (పి అండ్ సి) టెక్నాలజీ సొల్యూషన్స్ సేవల సంస్థ స్ట్రాటస్‌ను 95 మిలియన్ డాలర్ల (సుమారు రూ.890 కోట్ల) నగదు చెల్లింపుతో కొనుగోలు చేసేందుకు ఇన్ఫోసిస్ కచ్చితమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో ముందస్తు చెల్లింపులు, ఎర్నౌట్‌లు కలిసి ఉంటాయి. యాజమాన్య ప్రోత్సాహకాలు, నిలుపుదల బోనస్‌లు మినహాయిస్తారు.




# చర్చలు అంటూనే దాడులు



ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఐదు రోజులపాటు దాడులను వాయిదా వేస్తున్నామంటూ ట్రంప్ చేసిన ప్రకటన కుట్రపూరితమని తెలిపోయింది. ఆ ప్రకటన అనంతరం కూడా ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో గురువారం ఆ దేశ నేవీ చీఫ్ అలీరేజా మృతి చెందారు. ఇరాన్ సెంట్రల్ సిటీ ఇష్ఫాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా విస్తృతంగా దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. అనేక ప్రాంతాల్లో ఇరాన్ మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు మిలటరీ ప్రకటన వెలువడింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైనదిగా భావించే హోర్మూజ్ జలసంధి మార్గంలో సాగే నౌకలకు టోల్ ఫీజు విధించే అంశంపై ఇరాన్ పార్లమెంట్ కసరత్తు చేస్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కి అత్యంత సన్నిహితమైన ది ఫార్స్, తస్నిమ్ వార్తా సంస్థలు ఈ మేరకు కథనాలు ఇచ్చాయి. ''ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, నియంత్రణను, పర్యవేక్షణను అధికారికంగా ప్రకటించేందుకు ఒక ప్రణాళికను అనుసరించాలని ఇరాన్ పార్లమెంట్ భావిస్తోంది. అదే సమయంలో ఫీజు వసూలు చేయడం ద్వారా కొంతమేరా ఆదాయం కూడా సృష్టించుకోవాలని యోచిస్తోంది.'' అని పార్లమెంట్ సభ్యుడు మహ్మద్‌రెజా కౌచిని ఉటంకిస్తూ ఈ వార్తా సంస్థలు తెలిపాయి. ''ఇది చాలా సర్వసాధారణం, ఇతర కారిడార్ల గుండా సాగేటపుడు చెల్లించే రవాణా ఫీజు మాదిరిగానే ఇక్కడ కూడా చెల్లించాల్సి వుంటుంది. హోర్మూజ్ జలసంధి కూడా ఒక కారిడారే.'' అని ఆ ఎంపి వ్యాఖ్యానించారు. ఆ మార్గానికి భద్రతను మేం కల్పిస్తున్నపుడు నౌకలు, చమురు ట్యాంకర్లు అటువంటి ఫీజులు చెల్లించడం కూడా సాధారణమేనని ఆయన వ్యాఖ్యానించారు.

# యుద్ధం ఆపాలి : ఆంటోనియో



పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న యుద్ధంపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'ప్రస్తుతం పరిస్థితి అదుపు తప్పింది. తీవ్ర పరిణామాలతో కూడిన యుద్ధానికి దారితీసే అంచున ఉంచి' అని ఆయన హెచ్చరించారు. కాగా, ఈ యుద్ధంపై ఆయన 'పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన కొన్ని గంటలకే, ఈ పోరాటం ఎవరూ నియంత్రించలేరని గొలుసుకట్టు పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉందని నేను హెచ్చరించాను. నేను అంచనా వేసినట్టే.. ఇప్పటికీ మూడు వారాలు గడిచినా యుద్ధం ఆగలేదు. అదుపు తప్పింది. ఈ సంఘర్షణ ఇంత తీవ్రరూపం దాలుస్తుందని నాయకులు సైతం ఊహించలేదు. ఈ అపారమైన హింస కేవలం మానవుల్ని బాధించడమే కాకుండా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సైతం కుదిపేస్తోంది' అని ఆయన అన్నారు. ఈ సమయంలో దౌత్యపరమైన జోక్యం ఆవశ్యకతను ఆయన పునరుద్ఘాటించారు. హింసను పెంచడం ఆపాలని సంబంధిత పక్షాలన్నింటినీ ఆయన కోరారు. ఈ యుద్ధం వల్ల మానవుల బాధలు తీవ్రతరమయ్యాయి. పౌర మరణాలు పెరుగుతున్నప్పుడు, ప్రపంచ ఆర్థిక ప్రభావం అంతకంతకూ వినాశకరంగా మారుతున్నప్పుడు ఈ యుద్ధాన్ని ముగించడానికి ఇదే సరైన సమయం అని ఆయన నొక్కి చెప్పారు.

## నయారా ఎనర్జీ పెట్రో మంట




దేశంలోనే అతిపెద్ద ప్రయివేటురంగ పెట్రోల్ ఇంధన రిటైలర్ నయారా ఎనర్జీ వాహనదారులకు గట్టి షాక్ ఇచ్చింది. గురువారం నుంచి ఇంధన ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్ లీటరుకు రూ.3 మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణం గా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడంతో ఆ భారాన్ని వినియోగదారులపైకి మళ్లించాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ ధరల పెంపు స్థానిక పన్నులు ఆధారంగా రాష్ట్రాల వారీగా మారుతూ ఉంటుంది. కొన్నిచోట్ల పెట్రోల్ ధర రూ.5.30 వరకు పెరిగే అవకాశం ఉంది. రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ భారత్‌లో 6,967 పెట్రోల్ పంపులను కలిగి ఉంది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభమైనప్పటి నుండి అంతర్జాతీయ చమురు ధరలు సుమారు 50 శాతం పెరిగాయి. ప్రభుత్వరంగ చమురు సంస్థలు ప్రీమియం పెట్రోల్‌పై లీటర్‌కు రూ.2.30 మేర పెంచగా.. ఇతర ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి.

## ప్రయివేటు బ్యాంక్‌ల్లో అంతర్గత కల్లోలాలు..




భారత ప్రయివేటు రంగ బ్యాంక్‌ల్లో అంతర్గత కల్లోలాలు పెరుగుతోన్నాయి. గతంలో మొండి బాకీలతో ఇబ్బందులు పడగా.. ఇప్పుడు పాలనపరమైన లోపాలు, నాయకత్వ పద్ధతులతపై కలహాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పార్ట్‌టైం ఛైర్మన్ అతన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామా బ్యాంకింగ్ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఇంతకంటే ముందు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో జరిగిన రూ.590 కోట్ల ప్రభుత్వ నిధుల మళ్లింపు ఉదంతం, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో మున్సిపల్ కార్పొరేషన్ నిధుల గందరగోళం, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో అకౌంటింగ్ లోపాలు ప్రయివేటు బ్యాంకింగ్ వ్యవస్థలోని నిర్వహణ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. గతంలో ఎస్ బ్యాంక్ ఎదుర్కొన్న పాలనా పరమైన సంక్షోభాన్ని ఇవి మళ్లీ గుర్తు చేస్తున్నాయి. ఇటీవల ప్రయివేటు బ్యాంక్‌ల్లో నెలకొన్న గందరగోళంతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ గత మూడు నెలల్లో సుమారు 9.88 శాతం పడిపోయింది. ప్రయివేటు రంగ విత్త దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి సూచీ ఏకంగా 21 శాతం క్షీణించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పార్ట్ టైమ్ ఛైర్మన్ అతన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామా ఆ బ్యాంక్ గవర్నెన్స్‌పై ఇన్వెస్టర్లలో తీవ్ర ఆందోళన కలిగించింది. బ్యాంకులోని కొన్ని పద్ధతులు తన నైతిక విలువలకు అనుగుణంగా లేవని ఆయన పేర్కొనడం చర్చనీయాంశమైంది. దీనికి తోడు క్రెడిట్ సూయిస్ బాండ్ల అమ్మకంలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కొంతమంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను బ్యాంకు తొలగించింది. ఈ పరిణామాల వల్ల కేవలం వారం రోజుల్లోనే బ్యాంకు మార్కెట్ విలువ రూ.87,000 కోట్లు ఆవిరయ్యింది. ఈ విషయంలో ఆర్‌బిఐ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ ఇన్వెస్టర్లు మాత్రం బ్యాంకు అంతర్గత క్రమశిక్షణపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## మెటాలో 700 ఉద్యోగులపై వేటు





ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా తన రియాలిటీ ల్యాబ్స్, సేల్స్, ఫేస్‌బుక్ విభాగాల్లోని 700 మంది ఉద్యోగులను తొలగించింది. అయితే ఈ వేటు ప్రకటనకు ముందే టాప్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం రూ.8,600 కోట్ల భారీ స్టాక్ ఆప్షన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించడం ఇప్పుడు టెక్ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసింది. ఎఐ రంగంలో పెట్టుబడులు పెంచుతున్న క్రమంలో ఈ ఏడాది సుమారు 16,000 మందిని తొలగించాలని మెటా భావిస్తోంది. మరోవైపు అత్యున్నత నైపుణ్యాలు కలిగిన కీలక అధికారులు సంస్థను వీడకుండా ఉండేందుకే వచ్చే ఐదేళ్లలో దాదాపు 921 మిలియన్ డాలర్ల (రూ.8600 కోట్లు) మేర అదనపు వేతన పరిహారాన్ని కల్పించేలా ఈ ప్యాకేజీని రూపొందించింది. సామాన్య ఉద్యోగులపై వేటు వేస్తూ, అగ్రశ్రేణి అధికారులకు వేల కోట్ల నజరానా ప్రకటించడంపై సాధారణ టెక్ ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

## డాలర్‌కు ప్రత్యామ్నాయాలపై చమురు కంపెనీల దృష్టి

అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భారత చమురు కంపెనీలు భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే రష్యా చమురు కొనుగోళ్లను ప్రత్యామ్నాయ కరెన్సీలలో చెల్లింపులను పెంచుతున్నాయని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారని బ్లూమ్‌బర్గ్ ఓ కథనంలో వెల్లడించింది. రష్యా విక్రేతలు కలిగి ఉన్న ఓ ప్రత్యేక విదేశీ బ్యాంకు ఖాతాలలో రూపాయలను డిపాజిట్ చేయడం ద్వారా ఈ లావాదేవీలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ఆ నిధులు యూఏఈ దిర్హామ్ లేదా లేదా చైనా యువాన్‌లలోకి మార్చబడుతున్నాయి. విదేశాల్లో పరిమిత ఉనికి ఉన్న కొన్ని భారతీయ బ్యాంకులు ఈ వాణిజ్యాన్ని సులభతరం చేస్తున్నాయని సంబంధిత వ్యక్తులు తెలిపారు. దిర్హామ్, యువాన్‌తో పాటు, సింగపూర్ డాలర్, హాంకాంగ్ డాలర్‌ను కూడా కంపెనీలు పరిశీలిస్తున్నాయన్నారు. అయితే ఈ లావాదేవీలు ఆయా బ్యాంకుల సంసిద్ధతపై ఆధారపడి ఉంటాయని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పెంచుకోవడానికి ఈ నెల ప్రారంభంలో అమెరికా భారత్‌కు మినహాయింపు ఇచ్చింది. అమెరికా విధానాల్లో మార్పుల వల్ల వచ్చే ముప్పును తగ్గించుకోవడానికి ప్రత్యామ్నాయ కరెన్సీలలో చెల్లింపులు కోరుతున్నాయి. దీనిపై ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పందించలేదు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల చమురు బ్యారెల్ ధర 100 డాలర్లను దాటింది.


# లిప్ బామ్, లిప్ మాస్క్.. పెదవులకు ఏది అవసరం?



**హైదరాబాద్ పెన్ పవర్:** చిరునవ్వుకు పెదవులే అందం.. కానీ అవే పగుళ్లతో కళ తప్పితే.. మార్కెట్లో దొరికే వందల రకాల లిప్ బామ్‌లు వాడుతున్నా ఫలితం కేవలం గంటల వరకే పరిమితం అవుతోందా..? అయితే మీరు పెదవుల సంరక్షణలో ఒక ముఖ్యమైన విషయాన్ని మిస్ అవుతున్నట్లే.. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న లిప్ మాస్క్ అంటే ఏంటి? అది మీ పెదవులను రాత్రికి రాత్రే ఎలా మృదువుగా మార్చేస్తుంది..? ముఖ సౌందర్యంలో పెదవులు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే వాతావరణంలో వచ్చే మార్పులు, కాలుష్యం, సరైన సంరక్షణ లేకపోవడం వల్ల పెదవులు త్వరగా పొడిబారి, పగుళ్లకు లోనవుతుంటాయి. పెదవులపై ఉండే చర్మం మన ముఖంలోని మిగతా భాగం కంటే 70శాతం పలచగా ఉంటుంది. అందుకే వీటికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. ప్రస్తుతం మార్కెట్లో రకరకాల లిప్ బామ్స్, లిప్ మాస్క్లు అందుబాటులో ఉన్నాయి. కానీ వీటిలో ఏది ఎప్పుడు వాడాలో తెలియక చాలా మంది గందరగోళానికి గురవుతున్నారు. అసలు ఈ రెండింటికీ తేడా ఏంటి?

లిప్ బామ్: లిప్ బామ్ అనేది మనకు నిత్యం అందుబాటులో ఉండే ఒక అత్యవసర చికిత్స లాంటిది. ఇది పెదవులపై ఒక పలుచని పొరను ఏర్పరిచి, బయటి గాలి, దుమ్ము, సూర్యరశ్మి వల్ల పెదవుల్లోని తేమ ఆవిరి కాకుండా కాపాడుతుంది. పగటిపూట పెదవులు పొడిబారినట్లు అనిపించినప్పుడల్లా దీనిని రాసుకోవచ్చు. ఇది కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇస్తుంది. లిప్ బామ్ కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇస్తుంది. ఇది పెదవులను లోపలి నుండి రిపేర్ చేయలేదు. లిప్ మాస్క్: మనం ముఖానికి ఫేస్ మాస్క్ ఎలా వేస్తామో, పెదవుల కోసం ప్రత్యేకంగా రూపొందించినదే ఈ లిప్ మాస్క్. ఇది లిప్ బామ్ కంటే చాలా మందంగా ఉంటుంది. ఇందులో విటమిన్లు, నాణ్యమైన నూనెలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది పెదవుల లోపలి పొరల్లోకి వెళ్లి, దెబ్బతిన్న చర్మాన్ని బాగు చేస్తుంది. దీనిని సాధారణంగా రాత్రి పడుకునే ముందు అప్లై చేస్తారు. రాత్రంతా ఇది పెదవులపై ఉండి, ఉదయానికి వాటిని మృదువుగా, గులాబీ రంగులోకి మారుస్తుంది. వారానికి 3-4 సార్లు రాత్రి పడుకునే ముందు వేసుకోవడం ఉత్తమం.

# బట్టతలకు అసలు కారణం..



**హైదరాబాద్ పెన్ పవర్:** మీరు రోజురోజుకూ ఊడిపోతున్న జుట్టును చూసి ఆందోళన చెందుతున్నారా? ఎన్ని రకాల ఖరీదైన షాంపూలు, నూనెలు వాడినా ఫలితం ఉండటం లేదా? అయితే సమస్య మీ జుట్టులో లేదు.. మీ కడుపులో ఉందేమో ఒక్కసారి ఆలోచించండి.. 1.6 లక్షల మంది భారతీయ పురుషులపై జరిపిన తాజా అధ్యయనంలో మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలే జుట్టు రాలడానికి ప్రధాన కారణమని తేలింది. ముఖ్యంగా ఐటీ హబ్ అయిన హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండడ గమనార్హం. ఉదయం నిద్రలేవగానే అద్దంలో చూసుకున్నప్పుడు రాలిన జుట్టును చూసి ఆందోళన చెందని పురుషుడు ఈ రోజుల్లో అరుదు. జుట్టు పలచబడటం, నుదురు వెనక్కి వెళ్లడం వంటివి కేవలం సౌందర్య సమస్యలు మాత్రమే కాదు, అవి మీ శరీర అంతర్గత అనారోగ్యానికి సంకేతాలని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా 1.6 లక్షల మంది భారతీయ పురుషులపై జరిపిన ఒక భారీ సర్వేలో, జుట్టు రాలడానికి మలబద్ధకం, జీర్ణ సంబంధిత సమస్యలే ప్రధాన కారణమని తేలింది. మన జుట్టు ప్రధానంగా కెరాటిన్ అనే ప్రోటీన్‌తో తయారవుతుంది. మనం తీసుకునే ఆహారంలోని ప్రోటీన్లు, ఐరన్, విటమిన్లు జుట్టు కుదుళ్లకు చేరాలంటే, ముందుగా అవి మన పేగుల్లో సరిగ్గా శోషించబడాలి. జీర్ణక్రియ సరిగ్గా లేనప్పుడు లేదా మలబద్ధకం ఉన్నప్పుడు, శరీరం పోషకాలను గ్రహించలేదు. ఫలితంగా జుట్టుకు అందాల్సిన ఆహారం అందక అవి బలహీనపడి రాలిపోతాయి. పేగు సంబంధిత సమస్యలు శరీరంలో అంతర్గత మంటను పెంచుతాయి, ఇది జుట్టు కుదుళ్లను దెబ్బతీస్తుంది. 2024?2025 కాలంలో భారతీయ పురుషుల జీర్ణ ఆరోగ్యం గణనీయంగా క్షీణించినట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. జీర్ణ సంబంధిత రుగ్మతలు అత్యధికంగా పెరిగిన రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. దీని తర్వాత రాజస్థాన్, ఢిల్లీ ఎన్‌సిఆర్, మధ్యప్రదేశ్, గుజరాత్ మరియు బీహార్ రాష్ట్రాలు ఉన్నాయి. ఐటీ, కార్పొరేట్ రంగాల్లో పనిచేసే యువతలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. 10-నిమిషాల డెలివరీ యాప్‌ల ద్వారా వచ్చే జంక్ ఫుడ్, సమయానికి భోజనం చేయకపోవడం వంటి అలవాట్లు పేగుల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. ఫైబర్ లేని ఆహారం తీసుకోవడం వల్ల మలబద్ధకం ఏర్పడుతున్నాయి. కేవలం నూనెలు, షాంపూలు మారిస్తే జుట్టు పెరుగుతుందని అనుకోవడం ఒక అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. వేళకు భోజనం, సరిపడా నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. కేవలం జుట్టుకు చికిత్స చేయించుకునే ముందు మీ జీర్ణక్రియ, హార్మోన్లు, ఒత్తిడి స్థాయిలను పరీక్షించుకోవడం ఉత్తమం.

## బొడ్డులో ఆముదం వేస్తే రోగాలు మాయమవుతాయా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయుర్వేదం ప్రకారం బొడ్డు ప్రాంతం శరీరంలోని కీలక నాడులకు కేంద్ర బిందువు. ఇక్కడ నూనె రాయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ప్రాచీన కాలం నుండి నమ్ముతున్నారు. ప్రస్తుతం ఇదే పద్ధతి 'బెల్లీ ప్యాచ్' రూపంలో కొత్తగా ట్రెండ్ అవుతోంది. నేటి కాలంలో సోషల్ మీడియా పుణ్యమా అని రకరకాల హెల్త్ ట్రెండ్స్ పుట్టుకొస్తున్నాయి. అందులో ఒకటి 'ఆముదం బెల్లీ ప్యాచ్'. బొడ్డులో ఆముదం వేయడం వల్ల బరువు తగ్గుతారని, జీర్ణక్రియ మెరుగుపడుతుందని, శరీరం డీటాక్స్ అవుతుందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఆయుర్వేద చిట్కా వెనుక ఉన్న అసలు వాస్తవాలేంటి? దీనివల్ల నిజంగా లాభాలు ఉన్నాయా లేదా కేవలం ఇదొక భ్రమనా? బెల్లీ ప్యాచ్- ఆముదంలో తడిపిన దూదిని లేదా గుడ్డను బొడ్డుపై ఉంచి, దానిపై టేప్ వేసి రాత్రంతా ఉంచుతారు. డైరెక్ట్ మసాజ్- నిద్రపోయే ముందు రెండు మూడు చుక్కల ఆముదాన్ని బొడ్డులో వేసి సున్నితంగా మసాజ్ చేస్తారు.ఆముదానికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల ఈ పద్ధతి ద్వారా ఈ కింద పేర్కొన్న ప్రయోజనాలు కలగవచ్చని కొందరు నమ్ముతారు. మలబద్ధకం నుండి ఉపశమనం మరియు జీర్ణక్రియ మెరుగుపడటం. కడుపు ఉబ్బరం తగ్గడం. మహిళల్లో పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పి నుండి ఉపశమనం. శరీరంలోని మలినాలను తొలగించడం. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ పద్ధతి వల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉంటాయని చెప్పడానికి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. మన చర్మం బయటి పదార్థాలు లోపలి అవయవాల్లోకి చొచ్చుకుపోకుండా నిరోధించేలా నిర్మించబడింది. కాబట్టి బొడ్డుపై నూనె రాయడం వల్ల అది నేరుగా పేగులపై లేదా హార్మోన్లపై ప్రభావం చూపుతుందనడం కష్టమని వైద్యులు అంటున్నారు. ఒకవేళ ఎవరికైనా ఉపశమనం కలిగితే, అది నూనె వల్ల కంటే.. మసాజ్ చేయడం వల్ల కలిగే వెచ్చదనం మరియు రక్త ప్రసరణ పెరగడం వల్లేనని వారు వివరిస్తున్నారు. ఆముదం అందరికీ పడకపోవచ్చు. రాత్రంతా దీనిని చర్మంపై ఉంచడం వల్ల.. చర్మం ఎర్రబారడం లేదా దురద రావచ్చు. చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు రావచ్చు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, సున్నితమైన చర్మం ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా దీనిని ప్రయత్నించకూడదు. ఆముదం బెల్లీ ప్యాచ్ అనేది ఒక సహాయక చర్య మాత్రమే తప్ప, దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదు. మీకు తరచుగా జీర్ణ సమస్యలు ఉంటే కేవలం ఇలాంటి చిట్కాలపై ఆధారపడకుండా.. సమతుల్య ఆహారం, వ్యాయామం మరియు వైద్యుల సలహాలు పాటించడం శ్రేయస్కరం.

# మధుమేహం బాధితులు పనస తినొచ్చా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** వేసవి రాకతో మామిడి, పనస, నేరేడు వంటి అనేక సీజనల్ పండ్లకు డిమాండ్ పెరుగుతుంది. పనస పండు మనందరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండు. ముఖ్యంగా ఈ కాలంలో మార్కెట్లో ఘుమఘుమలాడే పనస తొనలు నోరూరిస్తాయి. పనస పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.వేసవిలో వచ్చే సీజనల్ పండ్లలో పనస ఒకటి. వేసవి రాకతో మామిడి, పనస, నేరేడు వంటి అనేక సీజనల్ పండ్లకు డిమాండ్ పెరుగుతుంది. పనస పండు మనందరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండు. ముఖ్యంగా ఈ కాలంలో మార్కెట్లో ఘుమఘుమలాడే పనస తొనలు నోరూరిస్తాయి. పనస పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల దీనిని ' సూపర్‌ఫుడ్' అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా పనస పండు ఫైబర్‌కు అద్భుతమైన, సహజమైన మూలం. ఆయుర్వేదంలో పనసకాయను బరువైన,నూనె అధికంగా ఉండే కూరగాయగా పరిగణిస్తారు. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. అలాగే పచ్చి పనసకాయతో రకరకాల వంటకాలు కూడా వండుకుని తింటుంటారు. ఇలా తినడం వల్ల శరీరంలోని వాతాన్ని సమతుల్యం చేయడానికి కూడా సహాయపడుతుంది. అదేవిధంగా బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు పనసకాయను జాగ్రత్తగా తినాలి. ఎందుకంటే ఇది జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. దాని అధిక పోషక విలువలు కారణంగా ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. పనస పండు తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది. మధుమేహం ఉన్నవారు పనస పండును తినడం ద్వారా శరీరంలోని గ్లైసెమిక్ ఇండెక్స్‌ను తగ్గించుకోవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. పనస పండును తినడం గుండెకు కూడా మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిలో అధికంగా ఉండే పొటాషియం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.పనసపండులో పీచుపదార్థం కూడా అధికంగా ఉంటుంది. మలబద్ధకం లేదా పేగు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు పనసపండును తినడం వల్ల పేగులు శుభ్రపడటానికి సహాయపడుతుంది. ఇది శరీరం నుంచి మలినాలను కూడా త్వరగా తొలగిస్తుంది. కడుపుకు మేలు చేయడమే కాకుండా చర్మానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పనసపండులో ఉండే 'ఎ', 'సి' విటమిన్లు కలిసి చర్మ, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అయితే పనసపండు అందరికీ మేలు చేయదు. గ్యాస్ లేదా జీర్ణ సమస్యలు ఉన్నవారు దీనిని మితంగా తీసుకోవాలి. అలాగే శరీరంలో వాత దోషం ఎక్కువగా ఉంటే, పనసపండు వంటకాలను తక్కువ మసాలాలతో తయారుచేసుకుని పరిమిత పరిమాణంలోనే తీసుకోవాలి.

# ద్రాక్ష తింటే ఒంట్లో జరిగేది ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎరుపు, ఆకుపచ్చ, నలుపు.. ఇలా ద్రాక్షలోని మూడు రకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, వాటి ప్రయోజనాల విషయానికి వస్తే దాదాపు అన్నింటిలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఇవి వాపును తగ్గించి, కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. ద్రాక్షలో విటమిన్లు సి, కె ఉంటాయి. ఇవి ఫైబర్‌కు కూడా మంచి మూలం. వేసవి కాలంలో ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను విరివిగా తింటారు. అవి మీ శరీరాన్ని తేమగా, తాజాగా ఉంచుతాయి. ఇలాంటి అద్భుతమైన జ్యూసీ పండ్లలో ద్రాక్ష ఒకటి. అనేక రంగులలో లభించే ద్రాక్షలు తీపిగా, పలుపుగా ఉంటాయి.. నలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగు ద్రాక్ష.. మూడు కూడా పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. అందుకే.. వీటిని తినాలని చెబుతున్నారు డైటీషియన్లు.. ద్రాక్షలను వైన్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు (రెస్వెరాట్రాల్).. ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాపర్, ఫోలేట్, విటమిన్లు సి, ఎ, కె, బి వంటి ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి.. రోగనిరోధక వ్యవస్థ కోసం ? ద్రాక్షలో విటమిన్ సి, విటమిన్ బి6, ఐరన్ ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. అందువల్ల, మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ద్రాక్షను రెగ్యులర్ గా తినవచ్చు.మలబద్ధకాన్ని నివారిస్తుంది: ద్రాక్షలో పీచుపదార్థం బాగా ఉంటుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అలసటను ఎదుర్కోవడానికి: ద్రాక్షలో విటమిన్లు, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, రాగి ఉంటాయి. ఇవి మీ శరీరానికి

శక్తిని అందించి, అలసటను తగ్గించడంలో సహాయపడతాయి. కళ్ళకు మేలు: ద్రాక్షలో ఉండే పాలిఫెనాల్స్ ? రెస్వెరాట్రాల్, మాక్యులర్ డీజెనరేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపు, శుక్లాలు వంటి కంటి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. ద్రాక్షను తినడం అంధత్వాన్ని నివారించడంలో కూడా సహాయపడవచ్చు. అందువల్ల, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ద్రాక్షను తినవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు..రక్తంలో చక్కెర నియంత్రణ : మధుమేహం ఉన్నవారికి ద్రాక్షపండ్లు కూడా మేలు చేస్తాయి. వాటికి మధుమేహ నిరోధక గుణాలు ఉన్నాయి.. అవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి : మీరు ద్రాక్షపండ్లను తినడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. ద్రాక్ష రసంలో ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. ఎముకలను బలపరుస్తుంది: ద్రాక్షలో రాగి, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచి, బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపొరోసిస్) ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

# మట్టికుండ నీటితో.. ఇన్‌డైజెషన్ ప్రాబ్లమ్స్‌కు చెక్

**హైదరాబాద్ పెన్ పవర్:** మట్టి కుండలో నీరు నిల్వ చేయడం వల్ల అది కేవలం చల్లబడటమే కాకుండా, నీటి నాణ్యత కూడా పెరుగుతుంది. మట్టిలో ఉండే సహజ సిద్ధమైన ఖనిజ లవణాలు నీటిలోకి చేరి, మన శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ సమతుల్యతను కాపాడతాయి. ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిజ్, వాటర్ ప్యూరిఫైర్ల కంటే ప్రకృతి సిద్ధమైన మట్టి కుండ నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు. ఈ వేసవిలో మీ ఇంట్లో ఒక మట్టి కుండను ఏర్పాటు చేసుకుని, చల్లని, ఆరోగ్యకరమైన నీటిని తాగమని సూచిస్తున్నారు నిపుణులు. వేసవి కాలం రాగానే భానుడి భగభగలు మొదలవుతాయి. ఈ సమయంలో మన శరీరానికి నీటి అవసరం చాలా ఎక్కువ. ఎండల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది ఫ్రిజ్‌లోని చల్లటి నీటిని తాగడానికి ఆసక్తి చూపుతారు. అయితే, ఫ్రిజ్ నీటి వల్ల గొంతు నొప్పి, జలుబు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీనికి విరుద్ధంగా, మన పూర్వీకుల కాలం నుండి వస్తున్న 'మట్టి కుండ' నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మట్టి కుండను 'పేదవాడి ఫ్రిజ్' అని పిలిచినప్పటికీ, అందులోని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమూల్యమైనవి. మట్టి కుండకు ఉండే సూక్ష్మ రంధ్రాలు నీటిని సహజంగా వడపోస్తాయి. ఇది నీటిలోని మలినాలను తొలగించడమే కాకుండా, హానికరమైన బ్యాక్టీరియాను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఫ్రిజ్ నీటిలా కాకుండా, కుండ నీరు బయటి ఉష్ణోగ్రతకు అనుగుణంగా చల్లబడుతుంది, దీనివల్ల శ్వాసకోశ సమస్యలు లేదా జలుబు చేసే ప్రమాదం ఉండదు.మట్టి కుండ నీరు తాగడం వల్ల తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది.ఈ నీరు శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. వేసవిలో ఎండల వల్ల కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, వడదెబ్బ నుండి రక్షించుకోవడానికి ఇది ఒక అద్భుత ఔషధం. మట్టిలో ఉండే విటమిన్లు, మినరల్స్ నీటిలో కలవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వేసవిలో చెమట వల్ల వచ్చే



చర్మ సమస్యలను, జిడ్డును తగ్గించడంలో కుండ నీరు సహకరిస్తుంది.మట్టిలో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎనర్జీ ఉంటుంది. ఎండలో తిరగడం వల్ల శరీరం డీహైడ్రేట్ అయినప్పుడు, కుండ నీరు తాగితే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు వెంటనే పెరుగుతాయి. ఇది తక్షణ శక్తిని ఇస్తుంది.

# ఆర్సీబీకి దెబ్బ మీద దెబ్బ: ఆరంభ మ్యాచ్‌కు ముందే మరో స్టార్ బౌలర్ దూరం





**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొన్ని గంటల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ అట్టహాసంగా ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, సన్ రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచులో తలపడనున్నాయి. ఈ తరుణంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బౌలర్ నువాన్ తుషార టోర్నీ ప్రారంభ మ్యాచుకు దూరమయ్యాడు. ఫిట్‌నెస్ పరీక్షలో విఫలం కావడంతో నువాన్ తుషారకు శ్రీలంక క్రికెట్ ఎన్ఓసి (చీూజ) నిరాకరించింది. దీంతో అతడు ఐపీఎల్ తొలి మ్యాచుకు అందుబాటులో ఉండే అవకాశం లేకుండాపోయింది. శ్రీలంక క్రికెట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ యాష్లే డి సిల్వా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఐదు వేర్వేరు ఫిట్‌నెస్ పరీక్షల్లో 29 పాయింట్లకు గాను పాస్ స్కోరు (17)ను సాధించడంలో తుషార ఫెయిల్ అయ్యాడని తెలిపారు. దీంతో అతడికి ఐపీఎల్?లో ఆడేందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు అతడికి ఎన్వోసీ నిరాకరించింది. ఇప్పటికే ఆర్సీబీ ప్రధాన బౌలర్ యశ్ దయాల్ వ్యక్తిగత కారణాలతో టోర్నీ నుంచి వైదొలిగాడు. మరో స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ గాయపడటంతో అతడు ఆడతాడా లేదా అన్న అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ సమస్యల కారణంగా నువాన్ తుషార దూరం కావడం ఆర్సీబీకి భారీ ఎదురు దెబ్బేనని అంటున్నారు విశ్లేషకులు. అయితే, మరో ఐదు రోజుల్లో ఫిట్?నెస్ నిరూపించుకునేందుకు అతడికి మరో అవకాశం ఇస్తారు. ఈసారి కూడా ఫెయిల్ అయితే మాత్రం తుషార మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యే ఛాన్స్ ఉంది. ప్రారంభ మ్యాచుకు తుషార కూడా దూరం కావడంతో అతడి స్థానంలో న్యూజిలాండ్ స్టార్ పేసర్ జాకబ్ డఫీ బరిలోకి దిగొచ్చు.

# నేటి నుంచే ఐపీఎల్-2026... కొత్త ఫీచర్లతో లైవ్ స్ట్రీమింగ్... ఎక్కడ, ఎలా చూడాలంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నమెంట్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్‌లో ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డిజిటల్ ప్రసార హక్కులను దక్కించుకున్న జియోహాట్‌స్టార్ తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మ్యాచ్‌లను లైవ్ స్ట్రీమింగ్ చేయనుంది. ఈసారి జియోహాట్‌స్టార్‌లో ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లోనూ కామెంట్రీ అందుబాటులో ఉంటుంది. అదనంగా బెంగాలీ, భోజ్‌పురి, హర్యానీ భాషల్లోనూ ఫీడ్స్ ఉంటాయి. మొబైల్ యూజర్ల కోసం ప్రత్యేకంగా వర్టికల్ లైవ్ ఫీడ్, 360-డిగ్రీ వ్యూ, మల్టీ-క్యామ్ ఫీచర్లను కూడా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), 2016 విజేత సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. రెండు నెలలకు పైగా క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించనున్న ఈ టోర్నీ మే 31న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్ రోజులు ఉన్నాయి. డబుల్ హెడర్ ఉన్న రోజుల్లో మొదటి మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు, రెండో మ్యాచ్ యథావిధిగా రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం జరిగే మ్యాచ్‌లకు 7:00 గంటలకు టాస్ వేస్తారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న పది జట్లు గ్రూప్ స్టేజ్‌లో ఒక్కోటి 14 మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2, ఫైనల్ ఫార్మాట్‌లో ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ), పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఈ మ్యాచ్‌లను దేశవ్యాప్తంగా 12 ప్రధాన నగరాల్లో నిర్వహించనున్నారు. ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్‌పూర్, న్యూ చండీగఢ్ నగరాలు ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న విండీస్ స్టార్ ప్లేయర్



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ విధ్వంసకర ఓపెనర్ ఎవిన్ లూయిస్ తీసుకున్న యూ-టర్న్ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కలేదన్న ఆవేదనతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన లూయిస్, ఇప్పుడు మళ్ళీ ప్యాడ్లు కట్టుకుని మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు.

లూయిస్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడమే కాకుండా, ఒక సంచలన ప్రకటన కూడా చేశాడు. కేవలం వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) క్రికెటర్‌గానే ముద్రపడిన అతడు, తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు టెస్ట్ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇందులో భాగంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో జట్టు తరఫున నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌తో తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు.

**లూయిస్ కెరీర్ హైలైట్స్:**

వన్డేలు: 67 మ్యాచుల్లో 2175 పరుగులు (5 సెంచరీలు).

టీ20లు: 65 మ్యాచుల్లో 1782 పరుగులు (2 సెంచరీలు).

కీలక రికార్డు: అంతర్జాతీయ క్రికెట్‌లో 176 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన ఏకైక ఆటగాడు.

టీ20 స్పెషలిస్ట్: విండీస్ తరఫున టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (125లి పరుగులు) సాధించిన రికార్డు ఇతడి పేరిటే ఉంది.

# ఫ్లాప్ హీరోయిన్స్ ని పట్టుకున్న అనిల్ రావుపూడి.. ఫేట్ మార్చేనా?

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రస్తుతం ఒక క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఫోకస్ పెట్టారు. వెంకటేష్, కల్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కనున్న ఈ సినిమా కోసం అనిల్ ఎంచుకుంటున్న హీరోయిన్ల పేర్లు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఫామ్‌లో లేని హీరోయిన్లను తన సినిమాలోకి తీసుకోవడం ద్వారా వారికి మళ్ళీ హిట్ ట్రాక్ ఎక్కించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మరి ఈ 'హిట్ మెషీన్' చేతిలో పడ్డాక ఆ ముద్దుగుమ్మల జాతకాలు మారతాయో లేదో చూడాలి.

**వెంకీ సరసన 'మహానటి'.. క్రేజీ కాంబో!:**

ఈ మల్టీస్టారర్ సినిమాలో విక్టరీ వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ పేరు బలంగా వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి ఇప్పటి వరకు ఒక్క సినిమాలో కూడా నటించలేదు, కాబట్టి ఈ కాంబినేషన్ ప్రేక్షకులకు చాలా కొత్తగా ఉంటుందని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. నిజానికి కీర్తి సురేష్‌కు ఈ మధ్య కాలంలో సరైన హిట్లు లేవు. ఇటీవల వచ్చిన 'ఉప్పుకప్పురంబు', 'రివాల్వర్ రీటా' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఇలాంటి టైమ్‌లో అనిల్ రావిపూడి సినిమాలో ఛాన్స్ రావడం కీర్తి కెరీర్‌కు ఒక పెద్ద ప్లస్ పాయింట్ అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**కల్యాణ్ రామ్ జోడీ ఎవరు? కృతీనా.. కయాదునా?:**

ఇక మరోవైపు ఇదే సినిమాలో నందమూరి కల్యాణ్ రామ్ సరసన నటించే హీరోయిన్ కోసం ఇద్దరి పేర్లను



పరిశీలిస్తున్నారట. ఒకరు 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి కాగా, మరొకరు కయాదు లోహర్. కృతి శెట్టి కెరీర్ మొదట్లో వరుస హిట్లు అందుకున్నప్పటికీ, ఈ మధ్య కాలంలో ఆమెకు ఒక్క సాలిడ్ హిట్ కూడా తగలలేదు. అటు కయాదు లోహర్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. వీరిద్దరిలో అనిల్ ఎవరిని ఫైనల్ చేసినా, వారికి ఒక అదిరిపోయే కమ్‌బ్యాక్ మూవీ దొరికినట్టేనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఇప్పటికే మీనాక్షి చౌదరి లాంటి హీరోయిన్ కి తన సినిమాల ద్వారా మంచి సక్సెస్ను అందించారు. ప్రస్తుతం ఈమె వరుస సినిమాలలో అవకాశానందుకుంటూ దూసుకు పోతోంది. ఇక ఇప్పుడు మళ్లీ అనిల్ రావిపూడి కొత్త సినిమాలో ఈ హీరోయిన్ల పేర్లు వినిపిస్తున్నాయి. కాబట్టి వీరి ఫేట్ మారుతుంది అనే కామెంట్లు వ్యక్తమవుతున్నాయి

**అనిల్ రావిపూడి అంటేనే 'హిట్' గ్యారెంటీ:**

ఇకపోతే అనిల్ రావిపూడి సినిమాలంటేనే మినిమం గ్యారెంటీ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. పటాస్ నుండి మన శంకర వర ప్రసాద్ వరకు ఆయన ఫ్లాప్ ఎరగని దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. హీరోయిన్లను చాలా ఎనర్జిటిక్‌గా, బబ్లీగా చూపించడంలో అనిల్ స్టైలే వేరు. అందుకే హిట్ కోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్న హీరోయిన్లకు అనిల్ సినిమా ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేస్తే, సక్సెస్ ఆటోమేటిక్‌గా వారి ఖాతాలో పడిపోతుందని టాలీవుడ్‌లో ఒక గట్టి నమ్మకం ఉంది.

**2027 సంక్రాంతికి అసలు మజా:**

ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హీరోయిన్ల విషయంలో ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా, లీక్ అవుతున్న పేర్లు మాత్రం అంచనాలను పెంచేస్తున్నాయి. 2027 సంక్రాంతి రేసులో నిలవనున్న ఈ మూవీతో వెంకీ, కల్యాణ్ రామ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. ఫామ్‌లో లేని హీరోయిన్ల ఫేట్ మార్చడంలో అనిల్ రావిపూడి మరోసారి సక్సెస్ అవుతారని అభిమానులు ఆశిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



కృతి శెట్టి రీగల్ గ్రీన్ లుక్ ప్యూర్ పర్ఫెక్షన్



సంయుక్త మీనన్ యొక్క బోల్డ్ చీర లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965